స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలి
• అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం
2

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 39 | ఆదివారం, 28 జూన్, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 39 | SUNDAY, JUNE 28, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |

## హ్యామ్ రోడ్లకు నేడే శ్రీకారం




• శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి • నల్లగొండ జిల్లా కనగల్ వద్ద పైలాన్ ఆవిష్కరణ • రూ.13,006 కోట్లతో 6,092 కిలోమీటర్ల మేర 441 ప్యాకేజీలుగా పనులు • నల్లగొండలో రూ.83 కోట్లతో తాగునీటి పథకానికి సీఎం శంకుస్థాపన • ఎన్‌జీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ

హైదరాబాద్/నల్లగొండ, జూన్ 27 (వార్త వేదిక సూర్య):

రాష్ట్రంలో హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) విధానంలో చేపట్టబోయే రోడ్ల పనులకు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ పడింది. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో హ్యామ్ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. కనగల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 'హ్యామ్ ప్రాజెక్టు పైలాన్'ను ఆవిష్కరించనున్నారు. రాష్ట్రంలోని రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. వాటిని సాధారణ విధానంలో కాకుండా హైబ్రిడ్ యాన్యునిట్ మోడ్‌లో నిర్మించేందుకు, ఆ రోడ్ల నిర్వహణను 15 ఏళ్లపాటు కాంట్రాక్టర్లే చేపట్టే విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఆర్‌అండ్‌బీలో ప్రత్యేకంగా హ్యామ్ పేరుతో ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆర్‌అండ్‌బీ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడెక్కడ ఎన్ని రోడ్లు నిర్మించాలో నిర్ణయించింది. దాని ప్రకారం ఉమ్మడి జిల్లాల వారీగా కలిపి 6,092 కిలోమీటర్లను 441 ప్యాకేజీలుగా విభజించింది. మిగతా 2లో..

## మీ భవిష్యత్తు నా బాధ్యత

• భూములిచ్చిన మీ త్యాగం వృథా కాదు • వెలిగొండ నిర్వాసితులకు సీఎం భరోసా • మీ స్ఫూర్తితో 23 లక్షల మందికి తాగునీరు • 4 జిల్లాల్లో 4.47లక్షల ఎకరాలకు సాగునీరు • అన్యాయం జరగనీయను.. అండగా ఉంటా • ఏ ప్రభుత్వమైతే ఏమిలే అని అనుకోవద్దు • వైకుంఠపాళీ ఆడొద్దు • గొడ్డలి పార్టీ మాయలో పడొద్దు: చంద్రబాబు • బాధితులకు రూ.300 కోట్ల నమూనా చెక్కు అందజేసిన ముఖ్యమంత్రి



*జాతికి అంకితం అంటూ... వెలిగొండ ప్రాజెక్టు వద్ద గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్థూపాన్ని చూస్తే ఆశ్చర్యం వేసింది. ఎలా మోసం చేస్తారో, ఏ విధంగా ఏమారుస్తారో తెలియాలంటే ఇలాంటి వాటిని మ్యూజియంలో పెట్టి ప్రజలకు వివరించాలి. 7225 మంది నిర్వాసితులు ఉంటే, వైసీపీ హయాంలో కేవలం 96 మందికి మాత్రమే పునరావాసం కల్పించారు. మా ప్రభుత్వం నిర్వాసితులందరికీ పరిహారం చెల్లిస్తోంది. వైసీపీ కనీసం నిర్వాసితుల గోడు వినేందుకు కూడా అవకాశం ఇవ్వకపోగా, కేసులు పెట్టించింది. గొడ్డలి పార్టీకి బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మీదే.*

*- సీఎం చంద్రబాబు, ఏపీ ముఖ్యమంత్రి*

మార్కాపురం, జూన్ 27 (వార్త వేదిక సూర్య):

'వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం ఒక చరిత్ర. ప్రాజెక్ట్ కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు వదిలేసిన మీ త్యాగం వృథా కాదు. మీ దాతృత్వం వల్ల నాలుగు జిల్లాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మీ పేరు చెప్పుకొని 23 లక్షల మంది ప్రజలు వెలిగొండ నీళ్లు తాగుతారు. వారి ఆశీస్సులతో మీ అందరి జీవితాలు మెరుగ్గానే ఉంటాయి. మీ భవిష్యత్తుకు అండగా నేనుంటా. మీ అందరి జీవితాల్లో ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత నేనే తీసుకుంటా.'' అని వెలిగొండ ముంపు గ్రామాల నిర్వాసితులు, రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద శనివారం వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు పరిహారం కింద మొదటి విడత రూ.300 కోట్లు నమూనా చెక్కును సీఎం అందజేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కాలువను పరిశీలించిన ఆయన, అక్కడి పొలాల్లో రైతులు, నిర్వాసితులతో మాట్లాడారు. వెలుగొండకు 1996లో నేనే శంకుస్థాపన చేశా. ఇప్పుడు నేనే పూర్తి చేస్తున్నా. ప్రస్తుత లెక్కల ప్రకారం ప్రాజెక్ట్ పూర్తి కావడానికి రూ.10,580 కోట్లు అవసరం. ఇప్పటి వరకు రూ.6,736 కోట్లు ఖర్చు చేశాం. ఇందులో రూ.759 కోట్లు గత రెండేళ్లలోనే ఖర్చు పెట్టాం. ఇప్పుడు నిర్వాసితుల కోసం రూ.905 కోట్లు మంజూరు చేశాం. అందులో రూ.300 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. గత వైసీపీ ఐదేళ్లలో కేవలం రూ.980 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. మేం నిర్వాసితుల కోసమే రూ.905 కోట్లు, నిర్మాణ పనులకు రూ.3వేల కోట్లకు పైగా వెచ్చిస్తున్నాం. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బిల్లులను మిగతా 2లో..



## నేడు పల్స్ పోలియో

• అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

హైదరాబాద్, జూన్ 27 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ ఆదివారం పల్స్ పోలియో నిర్వహించనున్నారు.అయిదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని నవజాత శిశువులు మొదలుకుని మిగతా 2లో..

## ముగ్గురు ముఖ్యమంత్రులు ఏం మాట్లాడుకున్నారు?

• ఆ చీకటి ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పండి • తెలంగాణ హక్కులుకు భంగం వాటిల్లేలా రేవంత్ నిర్ణయాలు • మరోమారు విమర్శలు గుప్పించిన బిఆర్ఎస్ నేత హరీష్‌రావు

హైదరాబాద్, జూన్ 27 (వార్త వేదిక సూర్య):



ఇటీవల కర్ణాటకలో మడు రాష్ట్రాల ముఖ్య మం త్రుల మధ్య జరిగిన చీకటి ఒప్పందాలు ఏంటని మాజీ మంత్రి, బీఆరఎస్ కీలక నేత హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో మడు రాష్ట్రాల సీఎంలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురే కూర్చుని ఏం ఒప్పందాలు చేసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఏపీలో గుండ్రేవుల ప్రాజెక్టులు కడతామంటుంటే మన ముఖ్యమంత్రి చారిత్రక ఒప్పందం అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులకు నీళ్లు ఇవ్వబోమని ట్రిబ్యునల్ చెప్తే, బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో దాన్ని రానీయకుండా అడ్డుకున్నామని, కానీ ఇప్పుడు ఏపీ ముఖ్యమంత్రి తన శిష్యుడైన తెలంగాణలో సీఎం అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును ముందుకు తెచ్చారని ఆరోపించారు. ఆర్‌డీఎస్ కు పక్కా నీటి కేటాయింపులపై ఏమైనా స్పష్టమైన హామీ వచ్చిందా అని ప్రశ్నిస్తూ, రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన లేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కాంప్ర మైజ్ అయినా బీఆరఎస్ అస్సలు ఒప్పుకోదని స్పష్టం చేశారు. గత అరవై ఏళ్లలో కాంగ్రెస్ ఏడాదికి సగటున 4 టీఎంసీల చొప్పున అనుమతులు తెస్తే, బీఆరఎస్ హయాంలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున పర్మిషన్లు తెచ్చామ ని గుర్తుచేశారు. మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నామని, ఇంకా 138 టీఎంసీల అనుమతులు రావాల్సి ఉందని వివరించారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా 'బనకచర్ల' ప్రాజెక్ట్ నిర్మిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందని, ఆ నిద్రను తట్టిలేపింది మిగతా 2లో..



## రెండో భార్య పిల్లలకూ.. పూర్వీకుల ఆస్తిలో సమాన వాటా

• మొదటి భార్య మరణానంతరం చేసుకొనే వివాహానికి చట్టబద్ధత • రెండో భార్య పిల్లలను అక్రమ సంతానంగా చెప్పొద్దు • వారికీ ఆస్తిపై హక్కులు ఉంటాయి: ఏపీ హైకోర్టు

అమరావతి, జూన్ 27 (వార్త వేదిక సూర్య):

మొదటి భార్య మరణానంతరం చట్టబద్ధంగా చేసుకున్న రెండో వివాహం తర్వాత జన్మించిన సంతానానికి పూర్వీకుల నుండి వచ్చిన ఆస్తిలో సమాన హక్కులు ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. రెండో భార్య పిల్లలను అక్రమ సంతానంగా ముద్రవేసి, ఆస్తిలో మిగతా 2లో..

## నాలుగు తరాలకు పరిష్కారమైన భూ వివాదం



న్యూఢిల్లీ, జూన్ 27: ఎప్పుడో ముత్తాతల కాలంలో ప్రారంభమైన భూ వివాదం ఎట్టకేలకు సుప్రీంకోర్టులో పరిష్కారమయింది. 15.5 బీఘాల (9.68ఎకరాలు) భూమి విషయమై 1957లో మొదలయిన కేసుపై ధర్మాసనం నాలుగో తరానికి చెందిన భూమి యజమానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. సేల్ డీడ్‌పై సంతకం పెట్టిన సాక్షి నివాసం విషయంలో తేడా ఉండడంతో సమస్య సుప్రీం కోర్టు వరకు వచ్చింది. ఉత్తరాఖండ్‌లోని నర్సిపూర్ కలాన్ గ్రామానికి చెందిన సరాఫత్ ఆలీ పూర్వీకులు 1957 జూన్ 4న ఆ భూమిని కొనుగోలు చేశారు. మైనర్లయిన తమ పిల్లల పేరున రాశారు. 1984లో మ్యుటేషన్ జరిగింది. యూపీ జమిందారీల రద్దు, భూసంస్కరణల చట్టం సెక్షన్ 154కు అనుగుణంగా సేల్ డీడ్ లేదని, అందువల్ల ఆ అమ్మకం చెల్లదని కొందరు హైకోర్టులో అప్పీలు చేశారు. ఆ నిర్ణయాన్ని సమర్థిస్తూ 2017లో హైకోర్టు తీర్పు ఇచ్చింది. చివరకు సరాఫత్ సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. సేల్ డీడ్‌పై సాక్షి సంతకం చేసిన బారు అనే వ్యక్తి నివాసం విషయంలో తేడా ఉండడంతో దానిపై హైకోర్టు సహా అధికార యంత్రాంగాలు అనుమానాలు వ్యక్తం చేసి అప్పీళ్లను కొట్టివేశాయి. సేల్ డీడ్‌లో బారు... 'నిహాంద్‌పూర్ సుతారి' గ్రామ వాసి అని పేర్కొనగా, 1995లో ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో మాత్రం 'నాసిర్‌పూర్ కలాన్' గ్రామ వాసి అని ఉంది. అందువల్ల సేల్‌డీడ్ చెల్లదని పేర్కొన్నాయి. కానీ ఈ అభిప్రాయంతో సుప్రీ



## ఎస్‌బీఐ రాజీ

• రాయదుర్గం భూమికి ప్రత్యామ్నాయంగా మరో స్థలం తీసుకునేందుకు సిద్ధం • హైకోర్టులో కేసు ఉపసంహరణకు ఆమోదం • సీఎస్‌తో ఎస్‌బీఐ ఉన్నతాధికారుల భేటీ విజయవంతం.. • ముగిసిన వివాదం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

హైదరాబాద్‌లోని రాయదుర్గంలో ఐదెకరాల భూమి అంశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) మధ్య రేగిన వివాదం సద్దుమణిగింది. ఎస్‌బీఐ రాష్ట్ర ప్రభుత్వంతో రాజీకి వచ్చింది. రాయదుర్గం భూమికి బదులుగా ప్రభుత్వం మరో చోట ఇచ్చే భూమిని తీసుకునేందుకు, భూవివాదంలో హైకోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకునేందుకు ఎస్‌బీఐ మిగతా 2లో..

## ఆర్టీసీ కార్మికుల హామీలు నెరవేరుస్తున్నాం

• వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం తగదు
• మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):



తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం విడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయన్నారు. 11శాతం పీఆర్సీ జులై జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విలీన ప్రక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోడల్ అధికారిగా జేఎల్‌సీ సునీత నియామకం జరిగిందన్నారు. ఏపీ తరహా ఇబ్బందులు రాకుండా విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
ఆదివారం 28 జూన్, 2026
సంపుటి: 2 | సంచిక: 39
Follow:

## నేడు పల్స్ పోలియో

(మొదటి పేజీ తరువాయి)

5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. జూన్ 28న రాష్ట్రవ్యాప్తంగా పోలియో బూత్‌లలో డ్రాప్స్ వేస్తారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగతా చిన్నారులకూ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండటంతో జులై 1న అదనంగా మరో రోజు కార్యక్రమం కొనసాగుతుంది. ఇకపోతే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇప్పటికే ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఒక్కరు కూడా మిగిలిపోకుండా బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కొత్త కాలనీలు, , గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదైందని, పోలియో రహిత హోదాను ఉమ్మడి రాష్ట్రంలోనే సాధించామని ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేశారు.

## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

**బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎంపి ఇలాగేనా వ్యాఖ్యలు**

**అసదుద్దీన్ వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్, జూన్ 27 (వార్త వేదిక సూర్య):

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారత పాస్‌పోర్టులు, పౌరసత్వంపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ఉన్న అసదుద్దీన్‌కు పాస్‌పోర్టుకు, పౌరసత్వానికి మధ్య ఉన్న చట్టపరమైన తేడాలు తెలిసి ఉండాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని పేర్కొన్న కిషన్ రెడ్డి.. ప్రజలను తప్పుదారి పట్టించే ముందు అసదుద్దీన్ ఒవైసీ పౌరసత్వ చట్టం1955, పాస్‌పోర్ట్ చట్టం1967లను మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలు చట్టంపై ఆయనకున్న అవగాహన లోపాన్ని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నాన్ని సూచిస్తున్నాయని మండిపడ్డారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కొందరు తప్పుగా చిత్రీకరిస్తున్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. విదేశాంగ శాఖ వివరణ ప్రకారం భారత పాస్‌పోర్టు విలువలేనిదని అర్థం కాదని, పాస్‌పోర్టు ఒక్కటే భారత పౌరసత్వానికి తుది, ఖచ్చితమైన ఆధారం కాదని మాత్రమే ప్రభుత్వం పేర్కొందని ఆయన వివరించారు. భారత పౌరసత్వం అనేది ఎల్లప్పుడూ భారత రాజ్యాంగం , పౌరసత్వ చట్టం1955 ప్రకారమే నిర్ణయించబడుతుందని స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ చట్టం1967 ప్రకారం పాస్‌పోర్టు అనేది ప్రధానంగా విదేశీ ప్రయాణాల కోసం ఉపయోగించే ఒక పత్రం (Tసజీల ఆనీఇబీపనిబి) మాత్రమేనని కేంద్ర మంత్రి తెలిపారు. ఆ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. ప్రజాహితం దృష్ట్యా భారత పౌరుడు కాని వ్యక్తికి కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్‌ను జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. గతంలో కూడా ఇటువంటి ప్రత్యేక సందర్భాలు ఉన్నాయని, అందువల్ల పాస్‌పోర్టును మాత్రమే పౌరసత్వానికి తుది ప్రాతిపదికగా పరిగణించలేమని చెప్పారు. ఇది ఇప్పటికప్పుడు తెచ్చిన కొత్త నిబంధన కాదని, 1967లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. దాదాపు 60 ఏళ్లుగా అమల్లో ఉన్న చట్టపరమైన అంశాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై నెట్టడం అవగాహన లోపమో, లేదా వాస్తవాలను దాచిపెట్టే కుట్రో అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టం1955 ప్రకారం ఒక వ్యక్తికి భారత పౌరసత్వం అనేది జననం, వంశపారంపర్యం, నమోదు లేదా నేచురలైజేషన్ ప్రక్రియల ద్వారా మాత్రమే లభిస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. గతంలో 2013లో బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ.. పాస్‌పోర్టు, జనన ధ్రువీకరణ పత్రం వంటి పత్రాలు మాత్రమే పౌరసత్వాన్ని నిరూపించడానికి పూర్తిగా సరిపోవని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు.

# హ్యామ్ రోడ్లకు నేడే శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

రూ.13,006 కోట్లతో ఈ పనులు చేపట్టనుంది. ప్యాకేజీల వారీగా ఈ పనులు చేపట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకోసం డిప్యూటీసీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆదివారం మధ్యాహ్నం కనగల్‌కు చేరుకోనున్నారు. పైలాన్‌ను ఆవిష్కరించిన అనంతరం నల్లగొండ పట్టణంలోని ఎన్‌జీ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం పాల్గొనున్నారు. నల్లగొండ మునిసిపల్ కార్పొరేషన్‌లో 24 గంటల కృష్ణాజలాల సరఫరాకు సంబంధించి రూ.83 కోట్లతో చేపట్టే పనులకు అక్కడే శంకుస్థాపన చేయనున్నారు. హ్యామ్ విధానంలో పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించి.. గతేడాది జూన్‌లో అందుకు అనుమతులు మంజూరు చేసింది. కానీ, సాంకేతికంగా తలెత్తిన పలు ఇబ్బందులతో ఈ పనులు ఒక పట్టాన ముందుకు సాగలేదు. పనుల నిర్వహణకు కాంట్రాక్టర్లు వేసిన టెండర్లలో అధిక ధరలు ఉండడం రాజకీయంగా కొంత దుమారం రేపింది. తాము నిర్మించిన రోడ్లకు చెల్లించే నిధుల విషయంలో సాంకేతిక ఇబ్బందులున్నాయని కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు వెనకడుగువేశారు. దీంతో ఏడాది కాలంగా ఈ పనుల వ్యవహారం ఒకడుగు ముందుకు, పది అడుగులు వెనక్కి అన్నట్టు మారింది. అయితే హ్యామ్ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇద్దరూ ఈ ఏడాది మార్చి నుంచి ప్రత్యేక దృష్టి సారించారు. టెండర్లలో వచ్చిన అధిక ధరల విషయంతోపాటు కాంట్రాక్టర్లు లేవనెత్తిన పేమెంట్ల విషయంలోనూ అధికారులతో మాట్లాడి.. ఆ రెండు సమస్యలను పరిష్కరించారు. అంతేకాకుండా కాంట్రాక్టర్లకు ఆర్‌బీఐ నుంచి గ్యారెంటీలు ఇప్పించేలా ఆర్థిక శాఖతో ఏర్పాటు చేయించారు. ఫలితంగా మొదట పిలిచిన టెండర్లలో వచ్చిన అధిక ధరలు తగ్గడంతోపాటు నిబంధనల ప్రకారం 5శాతం లోపే టెండర్ కొటేషన్లు వచ్చాయి. దాంతో పనుల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఇటీవల కాంట్రాక్టర్లతో లెటర్ ఆఫ్ అగ్రిమెంట్‌లకు సంబంధించిన పనిని అధికారులు దాదాపు పూర్తిచేశారు. కాంట్రాక్టర్లు రుణాల కోసం బ్యాంకర్లతో ఒప్పందాలు చేసుకున్న తరువాత లెటర్ ఆఫ్ అగ్రిమెంట్లలో పేర్కొన్న మేరకు పనులను ప్రారంలభించనున్నారు. లెటర్ ఆఫ్ అగ్రిమెంట్‌లు, బ్యాంకుల్లో రుణాల దశలు త్వరలోనే పూర్తికానున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన మేరకు హ్యామ్ పనులు పూర్తయితే మండల కేంద్రాల నుంచి జిల్లాలకు, జిల్లా నుంచి రాష్ట్ర రహదారుల అనుసంధానం పూర్తికానుంది. అలాగే రవాణా రంగం మరింత బలోపేతమవుతుందని ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొంటున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆదివారం హ్యామ్ పనుల శంకుస్థాపనకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురూ కాసేపు మాట్లాడుకున్నారు. కాగా, నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో జరిగే భారీ బహిరంగసభకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఏర్పాట్లన్నీ పూర్తిచేశారు. సభకు మహిళలు అధిక సంఖ్యలో వస్తుండటంతో 600 ప్రత్యేక బస్సులను అన్ని గ్రామాలకు పంపనున్నారు. వర్షాకాలం కావడంతో సభకు అంతరాయం కలగకుండా జర్మన్ హ్యాంగర్ టెంట్లను ఏర్పాటు చేశారు.

## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించేది లేదు

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి**

హైదరాబాద్,జూన్ 27 (వార్త వేదిక సూర్య):

వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించేది లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం రైతులు, గ్రామీణ పేదల ఉపాధిని దెబ్బతీసేలా ఉందని అన్నారు. వీబీజీ రామ్‌జీ పథకంపై తెలంగాణ క్యాబినెట్ సబ్ కమిటీ శనివారం సమావేశమైంది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ హాజరయ్యారు. వీబీజీ రామ్‌జీ పథకం అమలుపై చర్చించారు. పేదల భవిష్యత్‌ను తాకట్టు పెట్టే చట్టాన్ని అంగీకరించం. వీబీజీ రామ్‌జీ చట్టంపై సుప్రీం కోర్టును ఆశ్రయించాలన్న యోచనలో ఉన్నాం. కేరళ, కర్ణాటకలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తాం' అని ఉత్తమ్ వెల్లడించారు.



## ఆర్టీసీ కార్మికుల హామీలు నెరవేరుస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ్గనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మదు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మదు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు. దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన ప్రక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మాట విద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన ప్రక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరని అన్నారు.

# మీ భవిష్యత్తు నా బాధ్యత..

(మొదటి పేజీ తరువాయి)

కూడా రూ.140 కోట్లు చెల్లించాం. 2014-19 మధ్య కాలంలోనే చాలా వరకు టన్నెల్ పనులు చేశాం. నిర్వాసితులకు గత ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు. సొరంగాల్లో మట్టిని, రెండో టన్నెల్‌లో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ యంత్రాన్ని కూడా తొలగించలేదు. అవేమీ చేయకుండానే జాతికి అంకితం చేసింది. ఇది డ్రామానో లేక మోసమో మీరే గ్రహించాలి.'' అని అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.... ''మోసం చేయడంలో గొడ్డలి పార్టీ దిట్ట. కళ్లార్పకుండా అబద్ధాలు చెప్తూ, మనం తేరుకునేలోపే మో సం చేస్తారు. ఇటీవల అక్కడక్కడా జరుగుతున్న డిజిటల్ అరెస్టులు లాంటి ఘటనల తరహాలోనే ఆ పార్టీ మోసాలూ ఉంటాయి. 'ఏ ప్రభుత్వం ఉంటే మాకేమిలే' అనే భావనతో మీరు ఉండొద్దు. ప్రజల జీవితాలను ఎలా విధ్వంసం చేయొచ్చో గత ప్రభు త్వం నిరూపించింది. రాష్ట్రానికి జీవనాడిలాంటి పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోయేలా చేశారు. కానీ 2027 మార్చి నాటికి పోలవరం జాతికి అంకి తం చేసే లక్ష్యంతో మా ప్రభుత్వం పనులు చేస్తోం ది. ఇన్ని పనులు చేస్తున్న ప్రభుత్వాన్ని విస్మరించి కులం, మతం, పార్టీ అంటూ వైకుంఠపాళీ ఆట ఆడి, గొడ్డలి పార్టీ మాయలో పడొద్దు. మీ అభివృద్ధి చూసే బాధ్యత నాది. నాకు సహకరించే బాధ్యత మీది. నన్ను చూడండి. టీడీపీని చూడండి. ఎన్డీయేను చూ సి అండగా నిలబడండి. ప్రజలు ఆమోదించే వ్యక్తులనే వచ్చే ఎన్నికల్లో నేను ఎంపిక చేస్తాను. ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తాం. ఆదరించండి.''



'నేనెప్పుడు కూడా 30 ఏళ్ల ముందుచూపుతో పనులు చేపడతాను. ఆనాడు హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్టు, ఇతర ప్రాజెక్టుల నిర్వాసితులు అక్కడ కొన్న ఆస్తులు ఈరోజు కోట్ల విలువకు చేరాయి. మార్కాపురం ప్రాంతానికి కృష్ణాజలాలు ఇవ్వాలనే ఆలోచన 1985లోనే ఎన్టీఆర్ చేశారు. 1995లో నేను ప్రకాశం పర్యటనకు వచ్చిన ప్రతిసారీ వెలిగొండ గురించే ప్రజలు అడిగేవారు. సక్రమంగా పనులు జరిగి ఉంటే 10 ఏళ్ల క్రితమే ఇది పూర్తయ్యేది. ప్రాజెక్ట్ రావడం ద్వారా వనరులు పెరుగుతాయి. ఇటీవల తుంగభద్ర డ్యాంకు గేట్లు పెట్టేందుకు సహకరించా. ఈ సీజన్ కాపాడాం. నదుల అనుసంధానంతోపాటు భూగర్భజలాలను పెంచాలి. అందుకే జలధార కార్యక్రమం ప్రారంభించాం. లక్ష కోట్లతో రాయలసీమ హార్టికల్చర్ హబ్ ద్వారా మార్కాపురం ప్రజలకు మేలు చేస్తాం.''

నిర్వాసితుల్లో ఒక్కొక్కరిదీ ఓ దీనగాథ

'వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు తరతరాల నివాసాలను వదిలి, భూములను త్యాగం చేశారు. వారి కుటుంబాల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ. పుట్టిన ఊరు నుంచి వెళ్లిపోవాలంటే ఎవరికైనా బాధ కలుగుతుంది. ఏ ఒక్క నిర్వాసిత కుటుంబం నష్టపోకుండా వెలిగొండ పూర్తి చేస్తా. ఇది నా గ్యారెంటీ. ప్రాజెక్ట్ ద్వారా లబ్ధి పొందే ప్రజలే కాకుండా నిర్వాసితులు కూడా ఆనందంగా ఉండేలా చూసే బాధ్యత ప్రభుత్వానిది. నిర్వాసితుల కోసం కాలనీలను ఏర్పాటు చేస్తున్నాం. అన్ని విధాలా మార్కాపురం జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత నాది. నాకు అండగా నిలవండి.'' అని చంద్రబాబు కోరారు. దానికి ముందు.. వెలిగొండ ఫీడర్ కాలువ పనులను ఆయన పరిశీలించారు. గడువులోపు పనులు పూర్తి చేయకపోతే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతానని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు నిమ్మల, గొట్టిపాటి, డోలా, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## నాలుగు తరాలకు పరిష్కారమైన భూ వివాదం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామం పేరులో తేడా ఉందని అభ్యంతరం చెప్పారే తప్ప, సేల్‌డీడ్ నకిలీదనిగానీ, ఫోర్జరీ సంతకాలు చేశారనిగానీ, బలవంతంగా సంతకాలు చేశారనిగానీ ఎవరూ సవాలు చేయని విషయాన్ని ప్రస్తావించింది. అది మోసపూరితమని ఎవరూ ఆరోపించనందున, రిజిస్టర్ అయిన సేల్‌డీడ్‌ను చిన్న చిన్న తప్పిదాలతో రద్దు చేయలేరని స్పష్టం చేసింది. కొనుగోలు చేసినప్పటి నుంచి 69 ఏళ్లుగా ఆ భూమి వారి ఆధీనంలో ఉండడాన్ని కూడా బలమైన కారణంగా పేర్కొని అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

## ముగ్గురు సిఎంలు ఏం మాట్లాడుకున్నారు ?

(మొదటి పేజీ తరువాయి)

బీఆరఎస్సేనని చెప్పారు. పాలమరు పేరిట సమ్మక్క సారక్క ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఎండబెడుతున్నారని, తాగేందుకు మంచి నీళ్ల లేక పాలమరు తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలోని మేడిగడ్డ గేట్లను రిపేర్ చెయ్యడం చేతకాదు గానీ, తుంగభద్ర గేట్ల రిపేర్ కోసం రేవంత్ రెడ్డి వెళ్తున్నారని విమర్శించారు. హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డికి హిట్లర్ స్ఫూర్తి అయితే, నీళ్ల విషయంలో రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తి స్ఫూర్తి అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. గుంపు మేస్త్రి అయిన రేవంత్ రెడ్డి, తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావొద్దని హరీష్ రావు హితవు పలికారు. కాంగ్రెస్ వైఖరి వల్ల ఆంధ్రప్రదేశ్ సుజలం, కర్ణాటక సుఫలం, తెలంగాణ నిష్ఫలంగా మారుతోందని, కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు ఒక్క చుక్క నీటి విషయంలో అన్యాయం జరిగినా కేసీఆర్, బీఆరఎస్ ఊరుకునే ప్రసక్తే లేదని తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

## రెండో భార్య పిల్లలకూ.. పూర్వీకుల ఆస్తిలో సమాన వాటా

(మొదటి పేజీ తరువాయి)

వాటా నిరాకరించడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ఇటీవల ఓ కేసులో తీర్పు ఇచ్చారు. ప్రస్తుత కేసులో మొదటి భార్య చనిపోయిన తర్వాత రాఘవ అనే మహిళను పెళ్లి చేసుకున్నానని, ఆమె ద్వారానే కుమార్తెలు జన్మించారని స్వయంగా తండ్రి సోమరాజు చెబుతున్నారని కోర్టు గుర్తు చేసింది. రెండో భార్యకు పుట్టిన కుమార్తెలు చట్టబద్ధమైన సంతానం కాదని సోమరాజు మొదటి భార్య కుమారుడు సత్యనారాయణ వాదిస్తున్నప్పటికీ.. ఎలాంటి ఆధారాలను కోర్టు ముందు ఉంచలేదని పేర్కొంది. ఈ క్రమంలో పూర్వీకుల నుండి సోమరాజుకు సంక్రమించినఆస్తిని కుమారుడు సత్యనారాయణ, రెండవ భార్య రాఘవ, ఆమె కుమార్తెలకు సమాన వాటాలు కల్పిస్తూ కాకినాడ అదనపు జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. మొదటి భార్య కుమారుడి అప్పీల్‌ను కొట్టివేసింది.

## ఎస్‌బీఐ రాజీ

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, టీజీఐఐసీ ఎండీ శశాంకలతో ఎస్‌బీఐ ఉన్నతస్థాయి ప్రతినిధులు జీఎస్ రాణా, నీలేష్ ద్వివేదీ రాష్ట్ర సచివాలయంలో శనివారం మరోసారి సమావేశమయ్యారు. కాగా, రాయదుర్గంలోని ఐదు ఎకరాల భూమికి ప్రత్యామ్నాయంగా మరోచోట భూమి ఇస్తామన్న ప్రభుత్వ ప్రతిపాదనకు ఎస్‌బీఐ అంగీకరించిందని సమావేశం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటన చేసింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో 2.5 ఎకరాలు లేదా ఉస్మాన్‌నగర్‌లో 2.5 ఎకరాలు లేదా భారత్ ఫ్యూ చర్ సిటీలో 10-15ఎకరాలు ఇచ్చేందుకు సిద్ధమని ప్రభుత్వం ఇప్పటికే తెలిపింది. దీనికి అంగీకారం తెలిపిన ఎస్‌బీఐ ప్రతినిధులు.. బోర్డు ఆమోదం తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. హైకోర్టులో ఉన్న కేసును ఉపసంహరించుకుంటామని వెల్లడించారు. నిజానికి, గతంలో తాము కేటాయించిన 5ఎకరాలకు ప్రత్యామ్నాయంగా వేరేచోట భూములు ఇస్తామని రాష్ట్రప్రభుత్వం గత నెలలోనే ఎస్‌బీఐకి తెలిపింది. ఎస్‌బీఐ ప్రతినిధులు మే12న ప్రత్యామ్నాయ భూములను సందర్శించి సానుకూలంగా స్పందించారు. కానీ, ఉన్నతాధికారులు అంగీకరించడం లేదన్న కారణంతో నిర్ణయం మార్చుకుంది. రాయదుర్గంలోని సదరు భూములను ప్రభుత్వం వేలం వేయగా ఎకరాకు రూ.237 కోట్ల ధర పలికింది. ఆ తర్వాత సదరు భూములు తమవేనంటూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో ఎస్‌బీఐ తీరుపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఎస్‌బీఐకి ఇచ్చిన లీడ్ బ్యాంకు హోదాను, ఆ బ్యాంకులోని తమ ఖాతాలు, డిపాజిట్లను ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. దీంతో ఎస్‌బీఐ దిగివచ్చింది.

## 15న ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం ప్రారంభం

హైదరాబాద్, జూన్ 27 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన ఉద్యోగుల ఆరోగ్య పథకంపై ఎంప్లాsTS హెల్త్‌కేర్ ట్రస్టు సమావేశమైంది. జులై 15న ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం ప్రారంభించాలని నిర్ణయించింది. వారం రోజుల్లో ఆస్పత్రుల యాజమాన్యాలతో ట్రస్టు సభ్యులు సమావేశం కానున్నారు. అనంతరం నూతన ఈహెచఎస్ నిబంధనలను ట్రస్టు విడుదల చేయనుంది. భార్యాభర్తల్లో ఎవరైనా ఒకరి నుంచి మాత్రమే చందా తీసుకోవాలని ట్రస్టు నిర్ణయించింది. ప్యాకేజీ రేట్లు, ఆస్పత్రుల జాబితాను వచ్చే సమావేశంలో ఖరారు చేయాలని నిర్ణయించారు.




# అల్యూమినియం స్క్రాప్ పేరిట రూ.10 లక్షల టాకరా!

- నమ్మించి ముంచేసిన కిలాడీలు
- స్కూటర్‌పై డబ్బుతో పరారైన నిందితుడు
- మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల చేతికి చిక్కిన

కేటుగాడు.. రూ.7 లక్షలు, ఐ20 కారు స్వాధీనం



**రాజేంద్రనగర్, జూన్ 27 ( వార్త వేదిక సూర్య ) :**
పాత అల్యూమినియం స్క్రాప్ కొనుగోలు పేరుతో ఓ వ్యాపారిని రూ.10 లక్షలు మోసం చేసిన కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఒక నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.7 లక్షల నగదు, కారు, మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం, కాటేదాన్ ప్రాంతంలోని ఓ స్క్రాప్ దుకాణాన్ని లక్ష్యంగా చేసుకున్న నిందితులు అబ్దుల్ వహీద్ (ఏ--2), మరో నిందితుడు (ఏ--1) కలిసి మోసానికి పథకం రచించారు. పెద్ద మొత్తంలో పాత అల్యూమినియం స్క్రాప్ విక్రయానికి ఉందని దుకాణ యజమాని సుల్తాన్ పటేల్, వ్యాపారి మహ్మద్ యాసర్ పటేల్‌లను నమ్మించారు.ఈ నెల 19న స్క్రాప్ కొనుగోలు కోసం వచ్చిన మహ్మద్ యాసర్ పటేల్ వద్ద బ్యాంకులో జమ చేయాల్సి ఉందని చెప్పి ముందస్తు చెల్లింపుగా రూ.10 లక్షల నగదు తీసుకున్న ఏ--1, అనంతరం తన మొబైల్ ఫోన్‌ను నిలిపివేసి, బాధితుడి ద్విచక్ర వాహనంపై అక్కడి నుంచి పరారయ్యాడు.

దర్యాప్తులో ఏ--1 మోసపూరితంగా పొందిన నగదులో కొంత మొత్తాన్ని అబ్దుల్ వహీద్‌కు ఇచ్చినట్లు, అనంతరం బెంగళూరుకు వెళ్లి కొంత డబ్బు వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేసి, మిగిలిన రూ.7 లక్షలను తన ఇంట్లో దాచిపెట్టినట్లు పోలీసులు గుర్తించారు.

విశ్వసనీయ సమాచారం ఆధారంగా మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అబ్దుల్ వహీద్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.7 లక్షల నగదు, ఐ20 కారు, రెండు మొబైల్ ఫోన్లు, ఆరు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మైలార్‌దేవ్‌పల్లి, ఛత్రినాక పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని, మోసానికి సంబంధించిన నగదు, ఇతర ఆధారాల స్వాధీనం కోసం చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ అభినందించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, మిగిలిన సొత్తును త్వరలోనే రికవరీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.




## కోట్ల ఖర్చు.. పేదలకు నీడ లేదు

- కాటేదాన్ ఇంద్రమ్మ క్యాంటీన్‌పై ఉప్పమూరి విజయకుమార్ విమర్శలు
- కాటేదాన్ క్యాంటీన్ వద్ద శాశ్వత షెడ్డు నిర్మించాలని, వాంబే కాలనీలో కొత్త ఇంద్రమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని డిమాండ్

**రాజేంద్రనగర్, జూన్ 27 ( వార్త వేదిక సూర్య ) :**
రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఉన్న కాటేదాన్ ఇంద్రమ్మ క్యాంటీన్ వద్ద పేదలు, కార్మికులు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టిడిపి నాయకుడు ఉప్పమూరి విజయకుమార్ ఆరోపించారు.కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో ప్రతిరోజూ వేలాది మంది కార్మికులు ఇంద్రమ్మ క్యాంటీన్‌లో భోజనం చేస్తున్నప్పటికీ, కూర్చొని భోజనం చేసేందుకు సరైన షెడ్డు లేదా నీడ లేక ఎండలు, వర్షాల్లో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం, ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు.

అధికారులు సమస్యను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించిన విజయకుమార్, కాటేదాన్ ఇంద్రమ్మ క్యాంటీన్ వద్ద శాశ్వత షెడ్డు నిర్మించి తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే లక్ష్మీగూడ, ఆర్‌జీకే, వాంబే కాలనీ ప్రాంతాల్లో కూడా ఇంద్రమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు చాలా కాలంగా కోరుతున్నారని తెలిపారు. వాంబే కాలనీ సమీపంలో కొత్త ఇంద్రమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వం, సంబంధిత అధికారులను ఆయన కోరారు.

## పద్మశాలి నేతకు ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఘన సత్కారం


**సికింద్రాబాద్, జూన్ 27(వార్త వేదిక సూర్య)**



సికింద్రాబాద్ పద్మశాలి సంఘం నూతన అధ్యక్షులుగా మందార జగన్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని బీసీ కులాలకు తగిన గుర్తింపు కల్పించి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మంద జగన్ మాట్లాడుతూ.. సంఘ నియమాలకు ఎల్లపుడూ కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సంఘ సమస్యలు ఏమైనా ఉంటే నా దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు రామేశ్వర్ గౌడ్, కిరణ్ గౌడ్, కిషోర్ గౌడ్, చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు చిక్క దేవదాసు, మాజీ కార్పొరేటర్లు కంది శైలజ శ్రీకాంత్, డాక్టర్ హేమ సామల, లింగాని లక్ష్మీ ప్రసన్న శ్రీనివాస్, కంది నారాయణ తదితరులున్నారు.

## మృతుడి కుటుంబానికి డిఎన్ఆర్ ఆర్థిక చేయూత

**ఊర్కొండ, వార్తా వేదిక సూర్య**



మండల పరిధిలోని రేవల్లి గ్రామానికి చెందిన కర్రోళ్ల యాదయ్య (45)మృతి చెందిన విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్,కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ మాజీ అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి డిఎన్ఆర్, మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా రూ.5000/- అందజేశారు.ఈ కార్యక్రమంలో రేవల్లి గ్రామ సర్పంచ్ రొడ్డ బంగారు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయూబ్ పాష పిఎసిస్ డైరెక్టర్ ఫరీద్ వార్డు సభ్యులు కర్రోళ్ల వెంకటయ్య, కాటమోని వెంకటయ్య, ఎర్రోళ్ల జంగయ్య, పోలె శంకర్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఖలీల్ ఖాన్, జంగి రెడ్డి, కర్రోల్ల పరశురాములు, రమేష్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఖాజ, ఖలీల్, నాగయ్య, నాగేందర్, బాలస్వామి, అల్వాల్ రెడ్డి, రాములు, చిన్నయ్య, తాజుద్దీన్, శ్రీశైలం, జంగయ్య, మాల కృష్ణయ్య, మర్రికంటి మహేష్, చంద్రయ్య, హనుమయ్య, బొందిలయ్య, ఆంజనేయులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా బాలికల హాస్టల్లో స్పోర్ట్స్ సామాగ్రి అందజేత

**మిడ్జిల్, వార్తా వేదిక సూర్య**



మండల పరిధిలో వ్యాపార సంఘం అధ్యక్షులు గంజి కృష్ణ జన్మదిన వేడుకల సందర్భంగా అభిమానాన్ని చాటుకున్న బిఆర్ స్ యువ నాయకుడు ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ పవర్ అతని సొంత డబ్బులతో కస్తూర్బా బాలికల హాస్టల్లో స్పోర్ట్స్ కు సంబంధించిన సామాగ్రి ని బిఆర్ స్ మాజీ ఎంపీపీ బరిగల సుదర్శన్ ప్రస్తుత మల్లాపూర్ సర్పంచ్ పట్నం బంగారు మరియు బిఆర్ స్ నాయకుల ఆధ్వర్యంలో బాలికలకు క్రీడా సామాగ్రి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గంజి శేఖర్ ఆచారి శ్రీనివాసులు పాల్గొనడం జరిగింది.

# ఓటును కాపాడుకోని బీజేపీ కి బుద్ధి చెప్పుదాం




సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్


**కుత్బుల్లాపూర్, జూన్ 27 (వార్త వేదిక సూర్య):**
ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ ఐ ఆర్) పేరుతో ప్రజల ఓట్లను తొలగించి వారికి అనుకూలమైన వాళ్ళను కాపాడడానికి తీసుకువచ్చిందే ఎస్ ఐ ఆర్ అని కావున ప్రజలందరూ తమ ఓట్లను కోల్పోకుండా ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొని కాపాడుకొని రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కూ ని ఉన్నటువంటి బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడ కొట్టడానికి సిద్ధం కావాలని ఎస్ ఐ ఆర్ లో అందరూ పాల్గొనాలని నినాదంతో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో శనివారం షాపూర్ నగర్ లో గోడ పత్రికను ఆవిష్కరించారు.

అక్రమ చొరబాటు దారు లు ఇతర దేశస్తులు మరణించిన వారి ఓట్లను తొలగిస్తున్నామని ప్రచారంతో తీసుకువచ్చిన సర్ అసలు ఉద్దేశం బిజెపికి వ్యతిరేకులు అయినటువంటి ముస్లిం, క్రైస్తవ, దళిత, బహుజనుల ఓట్లు తొలగించడమే ప్రధాన ఉద్దేశం అని అన్నారు. రాజ్యాంగంలో ఓటు పౌరుని హక్కు అని చెప్తే, ఓటరుగా చేర్చుకోవాల్సింది పోయి గతంలో ఓటర్ అయిన వారినీ కూడా అనుమానాస్పదం గా ఉంచడం, పేర్లలో చిన్న చిన్న తప్పులు ఉన్నప్పటికీ పక్కన పెట్టడం లాంటివి అనేకం జరుగుతున్నాయని దీనివల్ల నష్టపోయేది ఎక్కువగా పనిచేసి బతికే కార్మికులేనని అన్నారు. సర్ పేరుతో బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికి వచ్చి ఫారం లు ఎప్పుడు ఇస్తారో తెలియక వారు పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడ్డదని,దీనివల్ల ప్రజలకు ఆర్థిక భారమే కానీ ఎలాంటి ఉపయోగం లేదని, ఒకవేళ వారు ఫారంలో నింప లేక పోతే వారి ఓటు హక్కును తొలగించడం రానున్న రోజుల్లో ఓటు లేదనే కారణంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందని పరిస్థితి ఏర్పడుతుందని ఇదే బిజెపి యొక్క అసలు ఎజెండా అని అన్నారు. ధనవంతులు ఫారంలు సరిగ్గా నింపి ఓటు పొందితే కార్మికులు సరిగ్గా నింపలేరు కాబట్టి కార్మికులకు ఓట్లు తొలగించి ధనవంతులకు ఓట్లుంచి మళ్ళీ పూర్వం రోజుల్లో ఉన్నవాడికే ఓటు,లేని వాడికి లేనట్టు తీసుకురావడమే బిజెపి,ఆర్ఎస్ఎస్ యొక్క ప్రధాన లక్ష్యమని, ఇది తెలుసుకొని ప్రజలంతా ఓటును కాపాడుకోని రానున్న ఎన్నికల్లో అదే ఓటుతో బిజెపికి బుద్ధి చెప్పాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శి కే స్వామి, ఏఐటిసి కార్యదర్శి బి శ్రీనివాస్ అధ్యక్షుడు హరినాథ్ రావు ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, యువజన సంఘం నాయకులు వంశీ, కీర్తి, పార్టీ నాయకులు సుంకిరెడ్డి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా : కోట శ్రీనివాస్ గుప్తా

**సికింద్రాబాద్, జూన్ 27(వార్త వేదిక సూర్య)**



ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం నాయకుడు కోట శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం (28) బిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నామాలగుండు లో జరిగే వారసిగూడ ఆర్యవైశ్య సంఘం ఎనకల్లో తనను అధ్యక్షులుగా అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ... గెలిచిన వెంటనే పేద విద్యార్థులకు విద్య ప్రోత్సాహక స్కాలర్ షిప్ లు, యువత మరియు మహిళల అభివృద్ధికి ప్రత్యేకత ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు, అదేవిధంగా సంఘ సమస్యలను పరిష్కరించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో సంఘ నేతలందరూ భారీ సంఖ్యలో పాల్గొని తనను గెలిపించాలని ఆయన కోరారు.

## వసంత నగర్ డివిజన్ లో నూతన ఫోనిక్స్ ఫిట్నెస్ జిమ్ ప్రారంభం

యువత మాదక ద్రవ్యాలను వదిలి వ్యాయామంపై దృష్టి పెట్టాలి

రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్

**కూకట్ పల్లి, జూన్ 27 (వార్త వేదిక సూర్య) :**



కూకట్ పల్లి నియోజకవర్గం, వసంతనగర్ డివిజన్ లో నూతన ఫోనిక్స్ ఫిట్నెస్ జిమ్ ను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనిల్ కుమార్ యాదవ్ (ఎంపీ రాజ్యసభ) హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలను వదిలి శరీర పౌష్టికానికి వ్యాయామం చేయాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, జిమ్ నిర్వాహకులు పృధ్వి, సుబ్రహ్మణ్యం, బాలాజీ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజ్ పుత్, కుకట్ పల్లి క్రిస్టియన్ మైనార్టీ సెల్ కోఆర్డినేటర్ మేకల మైఖేల్, ఏఎంసి డైరెక్టర్ ఫణీంద్ర కుమార్, కూకట్ పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కలికోట శంకర్, మహిళా సీనియర్ నాయకులు వనజ, స్వాతి రెడ్డి, కోమలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధే లక్ష్యం..

ధండమూడి ఎన్‌క్లేవ్ నూతన కమిటీకి అభినందనలు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్

**కుత్బుల్లాపూర్, జూన్ 27 (వార్త వేదిక సూర్య):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 287వ వార్డు, పేట్‌బషీరాబాద్ పరిధిలోని ధండమూడి ఎన్‌క్లేవ్ కాలనీ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు శనివారం బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ ని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అభినందనలు తెలియజేస్తూ, కాలనీ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలుకు తమ వంతు కృషి



చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో దండమూడి ఎనక్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షుడు కిరణ్ కుమార్, కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు సాయి రాజశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి జార్జ్ థామస్, కోశాధికారి నాగరాజు పుప్పాల, కార్యవర్గ సభ్యులు వెంకట రమణ, శ్రీ కృష్ణ ప్రసాద్, వాసుదేవ్, శ్రీ విక్రమ్ రావు, ఉదయ భాస్కర్ రావు, తిరుమల్ గౌడ్, అభిలాష్, శ్రీ చిన్నా రెడ్డి, సరోజా రెడ్డి, జ్యోతి, కాలనీ పెద్దలు సుధాకర్ రావు, ప్రభాకర్ రెడ్డి ఇంకా సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఓటర్ నమోదు ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు పాల్గొనాలి

నియోజవర్గంలో నివసిస్తున్న ప్రతి ఒక్క వ్యక్తి ఓటు నమోదు కావాలి

టిపిసిసి ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్



**కూకట్ పల్లి, జూన్ 27 (వార్త వేదిక సూర్య) :**
కూకట్ పల్లి నియోజకవర్గం లో సర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్) ప్రక్రియ విస్తృతంగా కొనసాగుతోంది. శనివారం నియోజకవర్గంలో జరుగుతున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని టిపిసిసి ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ సర్కిల్ ఉప కమిషనర్ ఆంజనేయులు స్వయంగా పర్యవేక్షించారు. బాలాజీ నగర్ లో బిఎల్వోలు బిఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాలను ఓటర్ కు అందజేశారు. ఒక్కో ఓటర్ పేరుతో ప్రింట్ అయిన రెండు పత్రాలలో ఓటర్ వివరాలను నమోదు చేసిన అధికారులు ఓ పత్రాన్ని ఓటర్ కు ఇవ్వగా మరో పత్రాన్ని తీసుకువచ్చి ఆ వివరాలను కంప్యూటర్లో అప్లోడ్ చేయనున్నారు. ఇక్కడ జరుగుతున్న ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ, ఓటరు వివరాల నమోదును డిసి స్వయంగా పరిశీలించారు. పార్టీపరంగా సర్ కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్ పార్టీ నేతలకు సలహాలు సూచనలు చేశారు. నియోజవర్గంలో నివసిస్తున్న ప్రతి ఒక్క వ్యక్తి ఓటు నమోదు కావాలని, అదే సమయంలో స్థానికంగా కొంతకాలంగా లేని వారిని గుర్తించి వారి ఓట్లను తొలగించాలని ఎట్టి పరిస్థితుల్లో దొంగ ఓట్లు నమోదు చేయరాదని అధికారులకు సూచించారు. ఓటర్ నమోదు ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని నిర్లక్ష్యంగా వహించిన నాయకులపై పార్టీపరంగా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .ఈ సందర్భంగా డిసి ఆంజనేయులు మాట్లాడుతూ ఓటర్ నమోదు వివరాలు అత్యంత ఖచ్చితత్వంతో కూడి ఉంటాయని ఎవరి ఓటయినా లేకపోయినా కొత్తగా ఓటరు గా నమోదు కావాలన్నా అధికారులను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్-219, బిఎల్- మౌనిక, బి ఎల్ ఏ- శ్రీకాంత్ ముదిరాజ్, బూతు-220 బి ఎల్ ఓ- లక్ష్మీ, బి ఎల్ ఏ- ఎండీ.జంగీర్, బాలాజీనగర్ డివిజన్, వివేకనగర్ కాలనీ, పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజపుత్, మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, సునీల్ కుమార్, పిడికిటి గోపాల్ చౌదరి, రంగమోహన్, సుధా, తదితరులు పాల్గొన్నారు.

## దివికెగిసిన బాలానగర్ కలం

**బాలానగర్, వార్తా వేదిక సూర్య**
మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ప్రభాకర్ శర్మ కన్నుమూశారు. కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయనకు నెల రోజుల క్రితం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స జరిగింది. అనంతరం కోలుకుని స్వగృహమైన బాలానగర్‌కు చేరుకున్నారు.ఇటీవల మళ్లీ అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేరగా చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు.బాలానగర్ అక్షర యోధుడు ప్రభాకర్ శర్మకు జర్నలిజంలో ప్రత్యేక గుర్తింపు ఉంది.తెలుగు భాష, తెలుగు సాహిత్యంపై ఆయనకు ఉన్న అపారమైన పట్టు ఆయన రాసిన ప్రతి వార్తలో ప్రతిబింబించేది. వార్తలను సాహిత్యంలోని ఉదాహరణలతో మేళవించి తనదైన శైలిలో పాఠకులకు అందించేవారు.

ఒకానొక సమయంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈనాడు ప్రతినిధిగా పనిచేస్తూ సంచలన కథనాలతో అధికారులను, ప్రజాప్రతినిధులను ఉలిక్కిపడేలా చేశారు. ఎన్నో అక్రమాలు, కుంభకోణాలను వెలుగులోకి తీసుకొచ్చి నిర్భయ పాత్రికేయుడిగా గుర్తింపు పొందారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా తన వృత్తి ధర్మాన్ని విడిచిపెట్టకుండా జీవిత చరమాంకం వరకు పాత్రికేయుడిగానే కొనసాగారు.

## హైదర్ నగర్ డివిజన్ లో త్రాగునీటి సమస్యపై మాజీ కార్పొరేటర్ పర్యటన

సమస్యను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని జలమండలి అధికారులకు సూచించిన నార్నె శ్రీనివాసరావు

**కూకట్ పల్లి, జూన్ 27 (వార్త వేదిక సూర్య) :**



శేరిలింగంపల్లి నియోజకవర్గం, హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్, సాయి ప్రశాంత్ నగర్, కృష్ణవేణి నగర్ కాలనీలలో గత కొంతకాలంగా వేధిస్తున్న త్రాగునీటి కొరత, సరఫరా సమస్యల పరిష్కారం కోసం శనివారం క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. హైదర్‌నగర్ మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జలమండలిసి అధికారులతో కలిసి ఆయన ఆయా కాలనీల్లో పర్యటించి సమస్యను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రకాష్ విలియమ్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు నరేందర్, రాజేష్‌లతో కలిసి నార్నె శ్రీనివాసరావు కాలనీల అంతటా పర్యటించి, స్థానిక ప్రజల నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు తక్కువ ప్రెషర్‌తో రావడం, కొన్ని ప్రాంతాల్లో అసలు సరఫరా కాకపోవడం వంటి సమస్యలను కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలనీల్లోని ప్రతి ఇంటికీ సరిపడా త్రాగునీరు అందాలనే లక్ష్యంతో అధికారులను క్షేత్రస్థాయికి పిలిపించడం జరిగిందన్నారు. ఎక్కడైతే పైప్‌లైన్ సమస్యలు లేదా వాల్వ్ సమస్యలు ఉన్నాయో వాటిని తక్షణమే గుర్తించి యుద్ధప్రతిపాదికన పనులు చేపట్టాలని అధికారులను కోరారు. వేసవి/ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జలమండలి మేనేజర్ ప్రకాష్ విలియమ్స్ స్పందిస్తూ సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించామని, సాంకేతిక లోపాలను సరిచేసి శ్రీరామ్ నగర్, సాయి ప్రశాంత్ నగర్, కృష్ణవేణి నగర్ కాలనీలలో త్రాగునీటి సరఫరాను త్వరలోనే పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. నీటి కొరత రాకుండా నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, స్థానిక మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారులకు తమ సమస్యలను వివరించారు.

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
ఆదివారం
జూన్ 28, జూన్ 2026
సంపుటి : 2 సంచిక : 38
Follow:




# అధికారుల 'మామూళ్ల' మత్తు..

### పారగాన్ కంపెనీ బరితెగింపు!

**- ఆదర్శ కాలనీలో పగిలిన తాగునీటి పైపులైన్..**

**24 గంటలకు రోడ్లపాలవుతున్న గంగమ్మ!**

రాజేంద్రనగర్, జూన్ 27 ( వార్త వేదిక సూర్య ) :

ప్రజల అవసరాల కంటే ప్రైవేట్ కంపెనీల స్వార్థమే మిన్నగా మారింది. అధికారుల అండదండలు ఉంటే చాలు.. ప్రభుత్వ ఆస్తులను ఎంతైనా ధ్వంసం చేయవచ్చనే దానికి రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఆదర్శ కాలనీలో జరుగుతున్న ఘటనే నిదర్శనం. కాలనీలో పారగాన్ బిస్కెట్స్ కంపెనీ యాజమాన్యం తమ స్వలాభం కోసం ఎలక్ట్రికల్ లైన్ పనుల పేరిట రోడ్లను యథేచ్ఛగా తవ్వేసింది. ఈ క్రమంలో స్థానికులకు తాగునీరు అందించే ప్రధాన పైపులైన్ ముక్కలై పోయింది. పైపులైన్ పగిలిపోయి దాదాపు వారం రోజులుగా వేలాది లీటర్ల మంచి నీరు డ్రైనేజీల పాలవుతోంది. గత 24 గంటలుగా సమస్య మరింత జటిలమై, నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఒకవైపు కాలనీవాసులు తాగడానికి చుక్క నీరు లేక అల్లాడుతుంటే, లక్షల లీటర్ల శుద్ధి చేసిన తాగునీరు వృధాగా పోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.



ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన జలమండలి, మున్సిపల్ అధికారులు ప్రైవేట్ కంపెనీ యజమానులతో చేతులు కలిపారని కాలనీవాసులు బహిరంగంగానే ధ్వజమెత్తుతు న్నారు. కంపెనీ ఇచ్చిన 'మామూళ్ల' మత్తులో ఊగుతున్న అధికారులు.. వారం రోజులుగా ఇంత పెద్ద ఎత్తున నీరు వృధా అవుతున్నా కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి దాగి ఉందనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ రోడ్లు తవ్వి, పైపులైన్ పగలగొట్టిన పారగాన్ కంపెనీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారితో కుమ్మక్కైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు తీవ్ర స్థాయిలో డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధి కారులు తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన పైపులైన్ మరమ్మతులు చెయ్యాలని స్థానికులు డిమాండ్ చేశారు.



## గ్రామాలకు దాహార్తి తీర్చిన మాతృమూర్తి

**మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడిన జనంపల్లి శశికళారెడ్డి**

జడ్చర్ల, వార్తా వేదిక సూర్య :

మండల పరిధిలోని చర్లపల్లి గ్రామం దగ్గర గత మూడు రోజుల క్రితం మిషన్ భగీరత పైప్ లైన్ పగిలి పోవడంతో మూడు రోజులుగా మిషన్ భగీరథ వాటర్ దాదాపు ఆరు గ్రామాలు గంగాపూర్, నెక్కొండ, తంగళ్లేపల్లి, కుర్వగడపల్లి, అమ్మపల్లి,తదితర గ్రామాలలో నీటి సరఫరా నిలిచి పోవడంతో గ్రామాల సమస్యను గుర్తించి,జడ్చర్ల ఎమ్మెల్యే వారి మాతృమూర్తి జనంపల్లి శశికళారెడ్డి మిషన్ భగీరథ సంబదించిన అధికారులతో మాట్లాడి గ్రామాలకు నీటి దాహర్తిని తీర్చినందుకు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే మాతృమూర్తికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## ఓటరు హక్కు పరిరక్షణే లక్ష్యం

**బిఆర్ఎస్ నాయకురాలు - మురారి స్మితా కోటేష్ గౌడ్**

సికింద్రాబాద్, జూన్ 27(వార్త వేదిక సూర్య)



ఓటరు హక్కు పరిరక్షణే లక్ష్యమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ అన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు శనివారం తార్నాక డివిజన్ పరిధిలోని ఇంటి ఇంటికి తిరుగుతూ బిఎల్ఓ అఖిల తో కలిసి ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఓటర్ల గుర్తింపు కార్డు వివరాలను పరిశీలించి, కొత్త ఓటరు నమోదు, వివరాల సవరణ, చిరునామా మార్పు మరియు ఇతర అవసరమైన మార్పులను చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహకారం అందించారు. అదేవిధంగా ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా నమోదై ఉండేలా చూసుకోవాలని, ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మురారి స్మితా కోటేష్ గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పల్స్ పోలియో విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

**- ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం**

**- ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో చుక్కలు వేయించండి**



రాజేంద్రనగర్, జూన్ 27 ( వార్త వేదిక సూర్య ) :

దేశాన్ని పోలియో రహితంగా కొనసాగించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. జననం నుంచి ఐదేళ్లలోపు వయస్సు గల ప్రతి చిన్నారికి సమీపంలోని పోలియో బూత్‌లలో ఉచితంగా రెండు చుక్కల పోలియో మందు వేయిస్తున్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను తప్పనిసరిగా పోలియో బూత్‌లకు తీసుకువచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

పోలియో అనేది చిన్నారుల్లో శాశ్వత అంగవైకల్యానికి దారితీసే ప్రమాదకరమైన వైరస్ వ్యాధి. ఈ వ్యాధిని పూర్తిగా నివారించడానికి పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత ప్రభావవంతమైన మార్గంగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అన్ని సాధారణ టీకాలు తీసుకున్న పిల్లలు కూడా నేడు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించుకోవాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. గతంలో ఎన్నిసార్లు పోలియో చుక్కలు తాగినా మరోసారి వేయించుకోవడం ద్వారా వైరస్‌పై మరింత రక్షణ లభిస్తుందని తెలిపారు. పిల్లలకు జ్వరం, జలుబు వంటి స్వల్ప ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ వైద్యుల సూచన మేరకు పోలియో చుక్కలు వేయించవచ్చని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో పోలియో బూత్‌లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేసి ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు కూడా పల్స్ పోలియో కార్యక్రమంలో భాగస్వాములై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలతో పాటు చుట్టుపక్కల ఉన్న ఐదేళ్లలోపు చిన్నారులను కూడా పోలియో బూత్‌లకు తీసుకువచ్చేలా సహకరించాలని సూచించారు.

"రెండు చుక్కలు... జీవితాంతం రక్షణ" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని వైద్య, ఆరోగ్య శాఖ పిలుపునిచ్చింది. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా చూసి, పోలియో రహిత భారతదేశాన్ని శాశ్వతంగా కొనసాగిద్దామని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## రంగారెడ్డి జిల్లాలో నేడు పల్స్ పోలియో కార్యక్రమం

**-4.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు.. 1,688 బూత్‌లలో విస్తృత ఏర్పాట్లు**

**- ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్యాధికారి డా. స్వర్ణకుమారి విజ్ఞప్తి**



రాజేంద్రనగర్, జూన్ 27 ( వార్త వేదిక సూర్య ) :

పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా రంగారెడ్డి జిల్లాలో నేడు (ఆదివారం) పల్స్ పోలియో రోగనిరోధక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ఒక్క ఐదేళ్లలోపు చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ప్రతి తల్లిదండ్రి తమ చిన్నారులను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి రెండు చుక్కల పోలియో మందు తప్పనిసరిగా వేయించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణకుమారి పిలుపునిచ్చారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,688 పోలియో బూత్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో పట్టణ ప్రాంతాల్లో 493, గ్రామీణ ప్రాంతాల్లో 1,195 బూత్‌లు ఉన్నాయి. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని 4,20,911 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు నిర్దేశించారు.కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 167 రూట్ సూపర్వైజర్ వాహనాలు, 50 మొబైల్ బృందాలు, 53 ట్రాన్సిట్ పాయింట్లు, 55 ప్రచార వాహనాలు, 12 జిల్లా స్థాయి పర్యవేక్షణ అధికారులు జిల్లాలోని అన్ని ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించనున్నారు. వ్యాక్సిన్ నాణ్యత దెబ్బతినకుండా ఉండేందుకు 43 కోల్డ్ చైన్ కేంద్రాలు, 2,010 వ్యాక్సిన్ క్యారియర్లు, తగినన్ని ఐస్ ప్యాక్‌లు సిద్ధంగా ఉంచారు.జిల్లాలోని 481 హైరిస్క్ ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించారు. అక్కడ నివసిస్తున్న 6,213 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు ప్రత్యేక బృందాలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నాయి. వలస కార్మికులు, నిర్మాణ ప్రాంతాలు, ఇటుక బట్టీలు, తాత్కాలిక నివాసాలు వంటి ప్రాంతాల్లోని చిన్నారులను గుర్తించి ఎవరూ మిగలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.ఈ మహా కార్యక్రమంలో 6 మంది ప్రోగ్రామ్ అధికారులు, 5 మంది డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, 54 మంది వైద్యాధికారులు, 61 మంది స్టాఫ్ నర్సులు, 153 మంది సూపర్వైజర్లు, 474 మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, 1,317 మంది ఆశా కార్యకర్తలు, 1,600 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు/ఆయాలు, 604 మంది నర్సింగ్ విద్యార్థులు పాల్గొని సేవలు అందిస్తున్నారు. వేలాది మంది సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టారు.పిల్లలకు ఇప్పటికే అన్ని సాధారణ టీకాలు పూర్తయినా, గతంలో పలుమార్లు పోలియో చుక్కలు తాగినా, ఈసారి కూడా తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారులు స్పష్టం చేశారు. అదనపు మోతాదు పిల్లల్లో పోలియో వైరస్‌పై మరింత రోగనిరోధక శక్తిని పెంచుతుందని తెలిపారు.

పోలియో వల్ల శాశ్వత అంగవైకల్యం వచ్చే ప్రమాదం ఉన్నందున ప్రతి చిన్నారికి రక్షణ కల్పించడం సమాజం బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. నేడు బూత్‌కు రాలేని చిన్నారులకు తరువాతి రోజుల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, సామాజిక కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కోరింది."ప్రతి చిన్నారికి రెండు చుక్కలు... పోలియోకు శాశ్వత చెక్" అనే సందేశంతో ప్రతి తల్లిదండ్రి తమ ఐదేళ్లలోపు చిన్నారులకు నేడు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత రంగారెడ్డి జిల్లా నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది.

## జన్మనిచ్చిన అమ్మను మరవద్దు - పునర్జన్మనిచ్చిన ఇందిరమ్మను మరవద్దు

**దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

దేవరకొండ జూన్ 27 ( వార్తా వేదిక సూర్య):-

వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన "ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర" సభలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని ప్రసంగించారు. "గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు" పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ బస్సు యాత్ర కాంగ్రెస్ పార్టీ గిరిజనుల పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని ఆయన అన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, "జన్మనిచ్చిన అమ్మను మరవద్దు పునర్జన్మనిచ్చిన ఇందిరమ్మను మరవద్దు" అని పేర్కొన్నారు. గిరిజనులు, ఎరుకలు, యానాదులు వంటి వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం చేయాలనే లక్ష్యంతో అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని ఎస్టీ రిజర్వేషన్లు కల్పించిందని గుర్తు చేశారు. గిరిజనులకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింపిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆయన అన్నారు. తండాలను



గ్రామపంచాయతీలుగా మార్చడం, గిరిజన గురుకులాల ఏర్పాటు, విద్యా సౌకర్యాల విస్తరణ, రోడ్లు, తాగునీరు, ఉపాధి అవకాశాల కల్పన వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే అమలయ్యాయని తెలిపారు. ప్రస్తుతం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తోందని పేర్కొన్నారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడటం, వారి హక్కులను పరిరక్షించడం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని ఆయన స్పష్టం చేశారు. గిరిజన సమాజం కాంగ్రెస్ పార్టీపై విశ్వాసాన్ని కొనసాగించాలని, అభివృద్ధి మరియు సామాజిక న్యాయం కోసం అందరూ కలిసి ముందుకు రావాలని ఎమ్మెల్యే బాలు నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గిరిజన సోదరులు పాల్గొన్నారు

## రాజాపూర్ మండల కేంద్రానికి నూతన ఎమ్మార్వో కార్యాలయ భవనం మంజూరు

**ప్రజల కల నెరవేర్చిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కృషి ఫలితం**

జడ్చర్ల, వార్తా వేదిక సూర్య :



నియోజకవర్గం శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి నిరంతర కృషి ఫలితంగా రాజాపూర్ మండల కేంద్రానికి నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం మంజూరైంది. దీంతో మండల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సౌకర్యవంతంగా అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఉన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రభుత్వ దృష్టికి ఈ అవసరాన్ని తీసుకెళ్లి, కార్యాలయ భవనం మంజూరుకు ప్రత్యేకంగా కృషి చేశారు. ఈ సందర్భంగా రాజాపూర్ మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ, మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, రాజాపూర్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందేలా ప్రతి అంశంపై నిరంతరం కృషి కొనసాగిస్తామని తెలిపారు.

## నేడు రంగారెడ్డి బీజేపీ నూతన జిల్లా కార్యాలయ ప్రారంభం.. ముమ్మరంగా ఏర్పాట్లు

**- రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పరిశీలన**

రాజేంద్రనగర్, జూన్ 27 ( వార్త వార్త వేదిక సూర్య ) :



రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఆదివారం (జూన్ 28) బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ చేతుల మీదుగా జరగనున్న ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు ముమ్మర ఏర్పాట్లు చేపట్టాయి.ఈ నేపథ్యంలో శనివారం నూతన జిల్లా కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న ఏర్పాట్లను తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నియోజకవర్గం ఇంచార్జి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి జిల్లా నాయకులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రారంభోత్సవానికి సంబంధించిన స్వాగత ఏర్పాట్లు, పూజా కార్యక్రమాలు, హోమం, కార్యాలయ సుందరీకరణ, అలంకరణ, సభా వేదిక, పార్కింగ్, కార్యకర్తల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి అంశం పకడ్బందీగా ఉండేలా నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా బీజేపీ నూతన కార్యాలయం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రారంభం కావడం పార్టీ కార్యకర్తలందరికీ గర్వకారణమని అన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ కార్యాలయం కేంద్ర బిందువుగా మారుతుందని పేర్కొన్నారు. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు నియోజకవర్గం తరపున చారిత్రాత్మక స్వాగతం పలకాలని, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే బీఎల్‌ఏల ముఖాముఖి మహాసభకు ప్రతి బీఎల్‌ఏ, పార్టీ కార్యకర్త తప్పనిసరిగా హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ శ్రేణుల సమిష్టి కృషితో రంగారెడ్డి జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవం బీజేపీ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 2 కే రన్ నిర్వహణ**

నల్లగొండ బ్యూరో, జూన్ 26 (వార్తా వేదిక సూర్య )




అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్గొండ పట్టణం లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు ఎన్.జి. కళాశాల నుండి క్లాక్ టవర్ వరకు 2 కిలోమీటర్ల రన్ (2 కె రన్) నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించి, విద్యార్థులు, యువత, పోలీసు అధికారులు, ప్రజలతో కలిసి రన్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును, కుటుంబాలను, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ప్రభుత్వ శాఖలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజ శాంతిభద్రతలకు కూడా ముప్పుగా మారుతుందని అన్నారు. యువత ఎలాంటి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయాలు లేదా అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, ఈ విషయంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ 2 కే రన్ ద్వారా యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, "డ్రగ్ ఫ్రీ నల్గొండ -- డ్రగ్ ఫ్రీ తెలంగాణ" లక్ష్యంతో సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ నాగరాజు, ఎస్ఐలు సైదా బాబు, శివ ప్రసాద్, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
ఆదివారం
జూన్ 28, జూన్ 2026
సంపుటి : 2 సంచిక : 38
Follow:


# సి.ఎం పర్యటన.. నల్లగొండ పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు




## జిల్లా ప్రజలు సహకరించాలి

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్






నల్లగొండ బ్యూరో, జూన్ 27 (వార్తా వేదిక సూర్య )

ఆదివారం నల్లగొండ పట్టణం లోని ఎన్.జి. కళాశాల మైదానం లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రత, సభకు హాజరయ్యే ప్రజల సౌకర్యార్థం ఈ ఆంక్షలు అమలు చేస్తున్నామని తెలిపారు. సభకు హాజరయ్యే ప్రజల కోసం ప్రత్యేక మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లు

1. మిర్యాలగూడ, తిప్పర్తి వైపు నుంచి వచ్చే ప్రజలు

మిర్యాలగూడ -- తిప్పర్తి -- దుప్పలపల్లి మార్గం , పానగల్ ద్వారా, అలాగే నకరేకల్ -- పానగల్ -- పుల్లారెడ్డి మార్గం మీదుగా సభా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. ఈ మార్గంలో వచ్చే వాహనాల కోసం కళాభారతి, మేకల అభినయ్ స్టేడియం, ఆర్య సమాజ్ ప్రాంగణం, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

2. సాగర్, దేవరకొండ, కనగల్, మునుగోడు వైపు నుంచి వచ్చే ప్రజలు

రూరల్ పోలీస్ స్టేషన్ మీదుగా మునుగోడు బైపాస్ ద్వారా పట్టణంలోకి ప్రవేశించి, వాహనాలను రాఖీల్స్ కాలనీ, వి.టి. కాలనీ, ఎల్.వి. పెట్రోల్ బంక్, ఆర్.ఆర్.ఆర్, రాఘువేంద్ర కాలనీ, రవీందర్ నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లో నిలిపివేయాలని సూచించారు. అదేవిధంగా, సభకు వచ్చే ద్విచక్ర వాహనాల కోసం పోలీస్ పరేడ్ గ్రౌండ్ మరియు బీట్ మార్కెట్ వద్ద ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండే ప్రాంతాలు

ముఖ్యమంత్రి సభా ప్రాంగణమైన ఎన్.జి. కళాశాలకు వెళ్లే మార్గం డి.టి.సి, మహిళా ప్రాంగణం డీఈఓ కార్యాలయం, క్లాక్ టవర్ నుంచి ఎన్.జి. కళాశాల వరకు పూర్తిగా ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఈ మార్గాల్లో సాధారణ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. పానగల్ పరిసర ప్రాంతాల్లో నివసించే పట్టణ ప్రజలు ట్రాఫిక్ ఆంక్షలు నేపథ్యం లో రామాలయం -- బస్టాండ్ మార్గాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సభకు హాజరయ్యే వాహనాలకు మాత్రమే సభా ప్రాంగణం వైపు అనుమతి ఉంటుంది. సాధారణ వాహనాలకు ఆ మార్గంలో అనుమతి ఉండదు. హైదరాబాద్ రోడ్డు పరిసర ప్రాంత ప్రజలు ట్రాఫిక్ ఆంక్షలు నేపథ్యంలో వివేకానంద విగ్రహం నుంచి ఇతర మార్గాలను ఎంచుకోవాలని, అక్కడ నుండి ఎ.జి కళాశాల వరకు పూర్తి నిషేధం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ, ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించి పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. ప్రజల సహకారంతో ముఖ్యమంత్రి పర్యటనను నిర్వహించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# శ్రీ ఆంజనేయస్వామి దుర్గ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరు యుగంధర్ రెడ్డి

దేవరకొండ జూన్ 27 (వార్త వేదిక సూర్య ):-

ఈరోజు కొండమల్లేపల్లి పట్టణంలోని దుర్గా నగర్ కాలనీలో గల శ్రీ ఆంజనేయ స్వామి దుర్గామాత ఆలయంలో గాయత్రీ పరివార్ నిర్వాహకులు స్థానిక సర్పంచ్ పసునూరు యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పసునూరు యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ కొండమల్లేపల్లి పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు వ్యవసాయంలో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. ఇకనుండి ప్రతి శనివారం ఈ ఆలయంలో యజ్ఞ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. యజ్ఞం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వికరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన ఈ యాదా ధనంజయ వరలక్ష్మి కోడలు పావని జన్మదిన సంస్కారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ పరివార్ నిర్వాహకులు వింజమూరు చంద్రమౌళి, దాచేపల్లి వెంకటేశ్వర్లు, ఏరుకొండ రాము, శంకర్, మరియు పరుశురాం బాబూజీ, లచ్చిరాం, వేదపండితులు రాఘవేంద్ర స్థానికులు వెంకటేష్, శ్రీను, భూతరాజు ఆంజనేయులు, కుమ్మం గిరి గౌడ్, మునిసి సంధ్యా మోహన్ తదితరులు పాల్గొన్నారు

# ఇళ్ల పట్టాలు, ఇళ్ల హామీలను వెంటనే అమలు చేయాలి

## పేదలకు ఇళ్ల పట్టాలకై జూలై 1 న ధర్నా

## పబ్బు వీరస్వామి పిలుపు



నల్లగొండ బ్యూరో, జూన్ 27 (వార్తా వేదిక సూర్య )

ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించాలన్న ప్రభుత్వ హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో జూలై 1 న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

శనివారం నల్లగొండలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ టౌన్ కమిటీ సమావేశం కోమటిరెడ్డి ప్రధ్యుమ్నారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వీరస్వామి మాట్లాడుతూ.. నల్లగొండ పట్టణంలో గత ఐదేళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలు ఇళ్ల కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పారదర్శకత పాటించాలని, 2002, 2005 సంవత్సరాల ఓటరు జాబితాలను బీఎల్ఓలకు అందుబాటులో ఉంచి అర్హుల పేర్లు తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఆసరా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులందరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పింఛన్ మొత్తాన్ని రూ.6,000 లకు పెంచడం తో పాటు ప్రజలకు ఇచ్చిన అన్ని ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, సహాయ కార్యదర్శి వి లెనిన్, నాయకులు కోమటిరెడ్డి ప్రధ్యుమ్నారెడ్డి, ఎం.నందం, సద్దాం సీతారాములు ,దోటి అక్కలయ్య, వల్కి వెంకటేష్, యూసుఫ్, వీరయ్య,నర్సింహా,అంజయ్య లు ఉన్నారు.



# చేవెళ్ల డిక్లరేషన్ను హామీలను వెంటనే అమలు చేయాలి

## మూడవాత్ రాంబల్ నాయక్ రాష్ట్ర అధ్యక్షులు లంబాడి హక్కుల పోరాట సమితి

## రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లంబాడి హక్కుల పోరాట సమితి రమావత్ సక్రు నాయక్

నల్లగొండ బ్యూరో, జూన్ 27 (వార్తా వేదిక సూర్య )

లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ సక్రు నాయక్ నల్లగొండ లో మాట్లాడుతూ .. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేవెళ్ల డిక్లరేషన్ లో గిరిజనులకు ఇచ్చిన హామీలను 30 నెలలు దాటిపోయిన ఇప్పటివరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి చేవెళ్ల డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లంబాడి తండాల గ్రామ పంచాయతీలకు సంవత్సరానికి 25 లక్షల రూపాయలు ఇస్తామన్నారు, సంత్ శ్రీ సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంవత్సరానికి 500 కోట్ల రూపాయలు ఇస్తామన్నారు, గిరిజన తండాలలో పాఠశాలలను ఎత్తివేస్తా ఉన్నారు. మరి గిరిజన జ్యోతి ఎక్కడ అమలవుతున్నట్టు అని అన్నారు. గిరిజనులకు రావలసిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను తప్పుదారి పట్టించి తీరని అన్యాయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.కావున గిరిజనలకు ఇచ్చిన హామీల పై శ్వేత పత్రం విడుదల చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తూ ఉన్నది అని అన్నారు.

# పట్టించుకోని ఐసిడిఎస్ అధికారులు




దేవరకొండ జూన్ 27 (వార్త వేదిక సూర్య ):-

నల్లగొండ జిల్లా చందంపేట పరిధిలోని పోలేపల్లి ఎన్ హెచ్ సి సెంటర్ లో ఆయా గా పనిచేస్తున్న అందుగుల అంజమ్మ కు వచ్చిన జీతం ఏపీఎం ముడి జయప్రసాద్ ఇవ్వకుండా ఎం ఎస్ అకౌంట్ చెక్కుల ద్వారా కొన్ని లక్షలు రూపాలు పక్కదారి పోలేపల్లి ఎన్ హెచ్ సి సెంటర్ లో 2018 నుంచి పనిచేస్తున్న ఆయా అందుగుల అంజమ్మ కు స్టార్టింగ్ జీతం 4000 వస్తే రెండు వేల జీతం ఇస్తూ మిగతా 2000 రూపాయలు ఆయన ఖాతాలో మరియు మూడు నాలుగు సంవత్సరాలు పూర్తి జీతం ఇవ్వకుండా 2026 జనవరి నుంచి ఇప్పటివరకు ఆయా కు 7000 జీతం పెరిగిన తర్వాత జీతం వస్తే డబ్బులు చెక్కు ద్వారా డ్రా చేసి ఒక్క రూపాయి కూడా నాకు ఇవ్వలేదు నేను చేసిన జీతం ఎందుకు ఇవ్వట్లేదు అని అడిగితే నీ జీతం గవర్నమెంట్ కు రిటన్ పంపించినా అని చెప్పేవాడు నేను నల్లగొండ జిల్లా డీపీఎం రామలింగయ్య ను అడిగితే మాకేమి పంపలేదు అని చెప్పడం జరిగింది స్కూలు కిరాయి పేరు మీద ఆటో డ్రైవర్ మీద మెంటనెన్స్ మీద అందులో వస్తువులు కొన్నామని చెప్పి దాదాపు నాలుగు లక్షల పైన విత్ డ్రా చేసిన చందంపేట ఏపీఎం ముడి జయప్రసాద్ పైన జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు విచారణ చేపట్టలేదు ఎమ్మెస్ అకౌంట్ స్టేట్మెంట్ కోసం ఆర్టిఐ 90 రోజులు గడుస్తున్న ఇప్పటివరకు రాతపూర్వకంగా సమాచారం ఇవ్వడం లేదు ఎందుకంటే అధికారులు చేసిన అవినీతి ఉందని ఏటీఎం అధికారులు సమాచారం ఇవ్వకుండా మేనేజ్మెంట్ చేసుకుంటున్నారని ఏపిఎం చేసిన ఫ్రాడ్ కొన్ని లక్షలు ఉన్నాయి కాబట్టి ఎక్కడ బయట పడతానని భయంతోటి ఇప్పటివరకు ఆర్ టి ఐ కి సమాధానం ఇవ్వలేని సంబంధిత అధికారులపై జిల్లా అధికారులు జిల్లా అధికారులు తక్షణమే స్పందించి ఈ ప్రాణపు కారణమైన అధికారులని వెంటనే సస్పెండ్ చేసి నాకు న్యాయం చేయాలని ఆశా వర్కర్ అయినా నన్ను ఆదుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాను

# 11 వా వార్డులో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ జూన్ 27 (వార్త వేదిక సూర్య):-




దేవరకొండ లో గల 11 వా వార్డులో రేపు (28-06-2026, ఆదివారం) దేవరకొండ నియోజక వర్గంలో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కార్యక్రమం రేపు ఉదయం 10:30 గంటలకు దేవరకొండ పట్టణంలోని 11వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి పున్న శైలజ వెంకటేశ్వర్లు 11వ వార్డు కౌన్సిలర్ ఎస్కే నవీద్ వారితో పాటు మున్సిపల్ కౌన్సిలర్ లు మరియు, మార్కెట్ డైరెక్టర్ సయ్యద్ దస్తగిర్ దేవరకొండ యూత్ ప్రెసిడెంట్ సయ్యద్ ఇస్మాయిల్ గారు, మున్సిపల్ సిబ్బంది, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొంటారు.

# నల్లగొండ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం లో సమస్యల పై తక్షణమే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలి

## తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు

## ముఖ్య మంత్రి కి బహిరంగ లేఖ విడుదల

నల్లగొండ బ్యూరో, జూన్ 27 (వార్తా వేదిక సూర్య )

నల్లగొండ కి ముఖ్య మంత్రి వస్తున్న నేపథ్యం లో తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు బహిరంగ లేఖ రాశారు. నల్లగొండ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం లో జరిగిన, జరుగుతున్న అక్రమ నియామకాలు, అవినీతి, విద్యార్థుల పై వేధింపులు, ఖాళీ పోస్టులు, ఔట్‌సోర్సింగ్ అక్రమాలు, ప్రజాస్వామిక వాతావరణం ఇతర సమస్యల పై తక్షణమే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం-ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన పరిస్థితులువిశ్వవిద్యాలయం అనేది కేవలం పరీక్షలు నిర్వహించే సంస్థ కాదు.అది రాజ్యాంగ విలువలు, సామాజిక చైతన్యం, శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య సంస్కృతిని విద్యార్థుల్లో పెంపొందించే కేంద్రం. కానీ ప్రస్తుతం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులను భాగస్వాములుగా కాకుండా అనుమానితులుగా చూసే పరిపాలనా ధోరణి కొనసాగుతోందనే అభిప్రాయం బలపడుతోంది. విద్యార్థులు తమ సమస్యలను ప్రస్తావించిన ప్రతిసారి చర్చల ద్వారా పరిష్కరించాల్సింది పోయి, క్రమశిక్షణ చర్యలు, సస్పెన్షన్లు, పోలీసు కేసులు వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వడం విద్యా వ్యవస్థ లక్ష్యానికి విరుద్ధం అని ఆయన చెప్పారు.

**2. 2012 అక్రమ నియామకాలపై తక్షణ చర్య**

2012 లో జరిగిన 31 టీచింగ్ నియామకాలపై రోస్టర్, రిజర్వేషన్ నిబంధనల ఉల్లంఘన జరిగిందని అనేక ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ కమిటీలు కూడా విచారణ చేసి నివేదికలు సమర్పించినప్పటికీ, వాటిపై ఇప్పటికీ స్పష్టమైన చర్యలు కనిపించలేదు. 2007 లో స్థాపించబడిన మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం లో 2012 లో అప్పటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి హయాంలో 31 టీచింగ్ పోస్టులను రోస్టర్, రిజర్వేషన్ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా భర్తీ చేశారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కమిటీ నివేదికలను అమలు చేయలేదు, ఈ నియామకాలపై ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ మరియు విచారణ కమిటీ అక్రమాలు జరిగినట్లు గుర్తించి చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.అక్రమ పద్ధతిలో నియామకమైన వారికి ప్రమోషన్లు ఇచ్చినారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016 లో ప్రస్తుత వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఇదే నియామకాలపై షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ, ప్రస్తుతం అదే వ్యక్తులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు ఇవ్వడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. మా విజ్ఞప్తి ఏమనగా.!కమిటీ నివేదికలను బహిరంగపరచాలి.బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.అక్రమ నియామకాల వల్ల నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలి.

**3. ఖాళీ టీచింగ్ పోస్టుల భర్తీ**

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో 130కు పైగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదు.చాలా విభాగాలు అతిథి అధ్యాపకులపై ఆధారపడుతున్నాయి. విశ్వవిద్యాలయంలో 130 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు అనేక టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నాయి.దీంతో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం వెంటనే అన్ని ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేయాలి.గతంలో పాలమూర్,తెలంగాణ,శాతవాహన, కాకతీయ,యూనివర్సిటీ ల కు సంబంధించిన ఇంజనీరింగ్ కళాశాలకు టీచింగ్ పోస్ట్స్ ఇవ్వడం జరిగింది. కానీ మహాత్మ గాంధీ యూనివర్సిటీకి ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించి ఇప్పటివరకు టీచింగ్ పోస్ట్ శాంక్షన్ చేయలేదు.ఇది మాత్మ గాంధీ యూనివర్సిటీ పట్ల జరుగుతున్న వివక్షతగా మేము భావిస్తా ఉన్నాం. తక్షణమే అన్ని డిపార్ట్మెంట్లకు శాశ్వత ప్రాతిపదికన ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.కావునా తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నియామక డ్రైవ్ నిర్వహించాలి.ఇంజినీరింగ్ కళాశాలకు కూడా శాశ్వత టీచింగ్ పోస్టులు మంజూరు చేయాలి.రిజర్వేషన్ నిబంధనల ప్రకారం పారదర్శక నియామకాలు చేపట్టాలి.

**4.ఔట్‌సోర్సింగ్ నియామకాలపై న్యాయ విచారణ.**

ఇంత పెద్ద యూనివర్సిటీలో 4 నాన్ టీచింగ్ స్టాఫ్, మాత్రమే ఉన్నారు. సుమారు 300 పైగా ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన ఔట్‌సోర్సింగ్ నియామకాలలో నిరుద్యోగుల నుండి లక్షల రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.దీనిపై స్వతంత్ర విచారణ జరిపి సంబంధిత అధికారులు, ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.. మా ప్రధానమైన డిమాండ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి లేదా విజిలెన్స్ కమిటీతో విచారణ జరపాలి.బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. భవిష్యత్తులో అన్ని నియామకాలను పారదర్శకంగా నిర్వహించాలి.

**5.విద్యార్థులపై సస్పెన్షన్లు-పోలీసు కేసులు**

విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అక్రమాలు,అవినీతిని ప్రశ్నించిన విద్యార్థులను సస్పెండ్ చేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయడం అత్యంత బాధాకరం. ప్రజాస్వామికబద్ధంగా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో విద్యార్థుల ప్రశ్నించే హక్కును హరించి వేస్తూ మహాత్మా గాంధీ యూనివర్సిటీ వి సీ నియంతలా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ సమస్యలు చెప్పిన విద్యార్థుల భవిష్యత్తుతో యూనివర్సిటీ యాజమాన్యం ఆడుకోవడం ఏ మాత్రం సమంజసం కాదు.విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులకు రక్షణ కల్పించాలి.ప్రశ్నించే హక్కు ప్రతి విద్యార్థికి రాజ్యాంగం కల్పించిన హక్కు. ఆ హక్కును అణిచివేయకుండా విద్యార్థులకు భరోసా కల్పించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి.ప్రజాస్వామ్యబద్ధంగా తమ సమస్యలను ప్రస్తావించిన విద్యార్థులపై కేసులు నమోదు చేయడం, బైండోవర్ చర్యలు తీసుకోవడం, సస్పెండ్ చేయడం రాజ్యాంగ హామీలకు విరుద్ధం. కావునా అన్ని కేసులను సమీక్షించి ఉపసంహరించాలి.సస్పెన్షన్లను రద్దు చేయాలి.విద్యార్థి సంఘాలతో చర్చల కమిటీ ఏర్పాటు చేయాలి.

**6.హాజరు శాతం పేరుతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకూడదు.**

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు వంటి కారణాల వల్ల హాజరు తగ్గిన విద్యార్థులకు మానవీయ దృక్పథం అవసరం.60% హాజరు ఉన్నప్పటికీ పరీక్షలకు అనుమతించకపోవడం వంటి ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కావునా ప్రత్యేక కండోనేషన్ విధానం తీసుకురావాలి.ఒక్క హాజరు కారణంగా విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడాలి.

**7.హాస్టల్,తాగునీరు,ఆహారం,మౌలిక వసతులు**

విద్యార్థుల ప్రాథమిక అవసరాలైన హాస్టల్, పరిశుభ్రత, నాణ్యమైన భోజనం, తాగునీరు, లైబ్రరీ, వైఫై వంటి అంశాల్లో లోపాలు ఉన్నాయని విద్యార్థులు పదేపదే తెలియజేస్తున్నారు. ఈ పరిస్థితులపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ నిర్వహించాలి.హాస్టల్ సదుపాయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

**8.మహనీయుల జయంతులను అధికారికంగా నిర్వహించాలి.**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, సేవాలాల్ మహారాజ్ వంటి మహనీయుల జయంతులను అధికారికంగా, విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించడం విశ్వవిద్యాలయ బాధ్యత.మానియులను గౌరవించే విధంగా ప్రతి సంవత్సరం అధికారిక వేడుకలు నిర్వహించాలి.వారి భావజాలంపై ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేయాలి.

క్యాంపస్‌లో రాజ్యాంగ విలువలపై కార్యక్రమాలు నిర్వహించాలి.

**9.స్వతంత్ర విచారణ కమిటీ ఏర్పాటు**

విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అన్ని ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రభుత్వం స్వతంత్ర కమిటీని నియమించాలి.

**10. మా విజ్ఞప్తులు.**

2012 అక్రమ నియామకాలపై కమిటీ నివేదికలను వెంటనే అమలు చేయాలి. అక్రమంగా జరిగిన నియామకాలు, పదోన్నతులపై సమగ్ర విచారణ జరపాలి. 130 ప్రొఫెసర్ పోస్టులతో పాటు అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి. ఔట్‌సోర్సింగ్ నియామకాల అవినీతిపై న్యాయపరమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

విద్యార్థులపై నమోదైన అన్యాయ కేసులు, సస్పెన్షన్లను సమీక్షించి ఉపసంహరించాలి. పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాలను పూర్తి చేయాలి. విశ్వవిద్యాలయంలో పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పరిపాలనను అమలు చేయాలి.

**11. ముఖ్యమంత్రి కి చివరి విజ్ఞప్తి...**

మీ నల్లగొండ పర్యటన కేవలం ఒక అధికారిక కార్యక్రమంగా కాకుండా, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో న్యాయం, పారదర్శకత, ప్రజాస్వామ్య పరిపాలన పునరుద్ధరణకు చారిత్రాత్మక ఆరంభంగా నిలవాలని కోరుకుంటున్నాము. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు పోషించిన పాత్రను గుర్తించి, వారి రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించే దిశగా మీరు ప్రత్యక్ష జోక్యం చేసుకోవాలని వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన అన్నారు.

# యువత స్వయం ఉపాధి కోసం అడుగులు వేయాలి

**- వర్కర్స్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ రవి వేమిరెడ్డి**

**- ఘనంగా అరిస్టాటిల్ పీజీ కళాశాల ఫేర్వెల్ బెస్ట్..**

**మొయినాబాద్ మున్సిపాలిటీ 27 జూన్ (వార్త వేదిక సూర్య):** యువత స్వయం ఉపాధి కోసం ముందడుగులు వేయాలని క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదల కలిగి ఉండాలని వర్కస్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో రవి వేమిరెడ్డి. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యురాలు అడ్వకేట్ సునీత లు పేర్కొన్నారు. శనివారము రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని ఇగురు సమీపంలో గల అరిస్టాటిల్ పీజీ కళాశాల లో ఫేర్వెల్ కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ఆ కళాశాల మేనేజ్మెంట్ నిర్వహించిన బెస్ట్ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఈవో రవి వేమిరెడ్డి తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యురాలు అనిత లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పేస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత పట్టుదల కృషితో ముందడుగులు వేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేసుకోవాలని తెలిపారు






విద్యార్థులు జీవితంలో కొత్త అవకాశాలను ధైర్యంగా స్వీకరించి నాయకత్వ లక్షణాలు విలువలు సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని తెలిపారు పారిశ్రామికవేత్తలుగా స్వయం ఉపాధితో ఎదుగుతూ పలువురికి ఉ ద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఉండాలన్నారు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో వ్యాపారాలు డిస్ట్రిబ్యూషన్ షిప్ అవకాశాలను వర్కర్స్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అందిస్తున్నామని రవివేమిరెడ్డి తెలిపారు యువత సాయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు మహిళా సాధికారత న్యాయ అవగాహన హోప్స్ చట్టం ప్రాముఖ్యత వార్ కౌన్సిల్ సభ్యురాలు అడ్వకేట్ బి సునీత విద్యార్థులకు వివరించారు ప్రతి పౌరుడికి న్యాయ పరిజ్ఞానం ఎంత అవసరమని మాజీ మెజిస్ట్రేట్ లహన్ కుకునూర్ రంజిత్ రెడ్డి విద్యార్థులకు సూచించారు విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలని తెలిపారు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి విజ్ఞానంతో ఎదగాలని సూచించారు విద్యార్థులు చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు అందర్నీ ఎంతో ఆకట్టుకున్నాయి అనంతరం విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతి మీదిగా బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు..




# చలో కొడంగల్ బ్యానర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కుంభం




**వలిగొండ: జూన్ 27 (వార్తా వేదిక సూర్య) :** ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపుమేరకు రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్ లో జరిగే కృతజ్ఞత ర్యాలీ బ్యానర్ ను ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీ నెరవేర్చినందుకు కేకే కమిటీని నియమించిందని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతిని ప్రతిహామీని నెరవేరుస్తుందని ఆయన అన్నారు. ఉద్యమకారులు చేపట్టే కృతజ్ఞత ర్యాలీ కార్యక్రమం అభినందనీయమని ఫోరం నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభ వెంకట్ పాపిరెడ్డి, ఉపసర్పంచ్ మల్గ మాధవి,ఉద్యమకారుల ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, కళ్లెం లక్ష్మారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని రవీందర్ గౌడ్, గౌరవ సలహాదారుడు బత్తిని సహదేవ్ గౌడ్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పల్సం సతీష్ గౌడ్ , గరిసె రవి,చిలుగూరి సత్తిరెడ్డి, కదిరేని స్వామి, బోడిగె సుదర్శన్,ఐటిపాముల పుష్ప, దండ మల్లికార్జున్, కొండూరు సత్తయ్య, ఎదురుగట్ల పెద్దయాదగిరి, చిన్న యాదగిరి, లక్ష్మయ్య,సందయ్య, తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

# మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన

**రామన్నపేట,( వార్త వేదిక సూర్య )జూన్ 27**
మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, రామన్నపేట ఆధ్వర్యంలో ఈరోజు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, రామన్నపేటలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ విలువలు, పౌరుల ప్రాథమిక విధులు, బాలల హక్కులు మరియు బాల కార్మిక వ్యవస్థ నివారణ, బాలలపై జరిగే దుర్వినియోగాల నివారణ, పోక్సో చట్టంపై అవగాహన, సేఫ్ టచ్ -- అన్‌సేఫ్ టచ్, సైబర్ భద్రతతో పాటు ఇతర ముఖ్యమైన న్యాయ అంశాలపై విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకొని, తమ హక్కులు మరియు విధులను తెలుసుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఎస్. శిరీష సూచించారు. అలాగే ఏవైనా న్యాయ సంబంధిత సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా మరియు మండల లీగల్ సర్వీసెస్ సంస్థలు అందించే ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానెల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు



# సుంకిశాల పాల సంఘం చైర్మన్ గా పోలేపల్లి బాలకృష్ణ

**వలిగొండ: జూన్ 27 (వార్తా వేదిక సూర్య) :**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సుంకిశాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ పాల సంఘం చైర్మన్ గా పోలేపల్లి బాలకృష్ణ డైరెక్టర్ గా తొడగల జగన్మోహన్ రెడ్డి, వేముల మైసమ్మ ,కార్యదర్శి పోలేపల్లి శీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివయ్య గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు పోలపల్లి వీరస్వామి, బూతు బి ఎల్ ఎ కమిటీ అధ్యక్షులు ఇంజమూరి రమేష్, వరికాంతపు రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్,మొగిలి పాక నరసింహ, పోలేపల్లి అశోక్, తుమ్మల సత్యనారాయణ రెడ్డి , ఈతాప మల్లేష్, రాచమల్ల శంకరయ్య, పరమేష్, బాలకృష్ణ, జంగయ్య, జంగారెడ్డి, పోలేపల్లి స్వామి, రాచమల్ల స్వామి, పోలేపల్లి నరసింహ, మల్లేష్ గౌడ్, నరేష్ ,ఎల్ల స్వామి, ఈతాప సత్తయ్య, కొమ్మగాని రవి గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# జూలై 9న వర్కింగ్ జర్నలిస్టుల మహాసభ !

**- జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యాదగిరి, విష్ణు**



**సంగారెడ్డి, వార్తా వేదిక సూర్య జూన్ 27:** సంగారెడ్డి జిల్లా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూజేఐజేయు) మహాసభ వచ్చే నెల 9వ తేదీన సంగారెడ్డి లోని టీఎన్జీవో భవన్ లో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా అర్హులైన వారికి ఇంటి స్థలం తో పాటు హెల్త్ కార్డును ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని ఎప్పటినుంచో కోరుతున్నామని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పటికీ, జర్నలిస్టులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. అంతేకాకుండా మిగిలిన వారందరికీ కూడా అక్రిడేషన్ కార్డులను జారీ చేయాల్సిందిగా తమ సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామని వివరించారు. ఈ సమస్యలన్నింటిపై చర్చించడానికి జిల్లా మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. జూలై 9న ఉదయం 11 గంటలకు మహాసభ ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే పైసల్ తో పాటు సంఘం రాష్ట్ర నేతలు పాల్గొంటారని చెప్పారు.జిల్లా మంత్రి తో పాటు ఎంపీలు ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు కూడా ఈ సమావేశానికి హాజరవుతారని వివరించారు. అందువల్ల జిల్లాలోని జర్నలిస్టులంతా ఈ మహాసభకు తరలి కావాల్సిందిగా కోరారు. జర్నలిస్టుల ఐక్యతను చాటి చెప్పేందుకు సువర్ణ అవకాశమని వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా శాఖ నూతన కమిటీ ఎన్నిక కూడా ఆ రోజు నిర్వహిస్తామని తెలిపారు. అందువల్ల ప్రతి జర్నలిస్టు మహాసభకు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా హెలెన్ కెల్లర్ 146 వ జయంతి ఉత్సవాలు

**రామన్నపేట (వార్తా వేదిక సూర్య) జూన్ 27**
ఎన్ పి ఆర్ డి మండలం కమిటీ ఆధ్వర్యంలో. రామన్నపేట మండల సెంటర్లో ఆఫీసులో మండల ఉపాధ్యక్షులు నాగు నరసింహ అధ్యక్షతన హె లెన్ కెల్లర్ 146 వజయంతి ని ఘనంగా నిర్వహించడం జరిగింది. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్ పి ఆర్ డి యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ పుట్టుకతో అందురాలు ,చెవిటి అయినప్పటికీ. పట్టుదలతో చదివి 1904 సంవత్సరంలో రాడ్కిప్ కాలేజీ ఆఫ్ హార్వర్డ్ యూనివర్సిటీ నుండి డిగ్రీ పట్టా పొందారని,ఆ రోజులలో ప్రపంచవ్యాప్తంగా వందలాది వ్యాసాలు, 14పుస్తకాలు, రాసి అనేక ప్రసంగాలు చేసినారని,వృద్ధులు, వితంతువు లు, వికలాంగులు, తమ హక్కుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పైన పోరాటాలు నిర్వహించాలని, వారిలాగా భయపడకుండా నిర్భయంగా జీవించి తమ కొరకు తామే కాకుండా ఇతరుల కొరకు పని చేయడం నేర్చుకోవాలని, వారిని స్ఫూర్తి గా తీసుకొని వికలాంగులు జీవించాలని అన్నారు.కొత్తగా పెన్షన్లు పెట్టుకున్న వారికి అందరికీ మంజూరు చేయాలని పాతవారికి పెన్షన్లు పెంచాలని అన్నారు.
వృద్ధులు,వికలాంగులు, వితంతుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాలని, మాటలతో కాక చేతలతో ఆచరణలో పనిని అమలు చేసి వారికి ఉపయోగపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో




ఎన్ పి ఆర్ డి మండల సహాయ కార్యదర్శి పున్న శ్రీధర్, మండల కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నరసింహ,మచ్చగిరి, అంజయ్య, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 29న జరిగే అభినంద సభను జయప్రదం చేయండి



**రామన్నపేట (వార్తా వేదిక సూర్య) జూన్ 27:** పర్యావరణ పరిరక్షణ వేదిక సమావేశం రహదారి బంగ్లాలో జరిగింది ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జల్లెల పెంటయ్య. కో కన్వీనర్ ఎండి రెహాన్. ఊట్కూరు నరసింహ. ఫజల్. రాజు. నోముల చిరంజీవి.మాట్లాడుతూ రామన్నపేట మండలంలో ప్రతిపాదించిన అంబుజా సిమెంట్ కంపెనీ రద్దు కావడం పట్ల ప్రజల పోరాట విజయం అన్నారు. పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 29న సోమవారం రోజున ప్రజల విజయాన్ని కాంక్షిస్తూ అభినంద సభ నిర్వహిస్తున్నట్లు వేదిక నాయకులు తెలిపారు. ఈ అభినంద సభకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు శ్రీ వేముల వీరేశం హాజరవుతున్నారు అలాగే వివిధ పార్టీల నాయకులు పాల్గొంటున్నారు. కావున మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి ప్రజలు ప్రజా ప్రతినిధులు యువతీ యువకులు విద్యార్థులు వ్యాపారస్తులు మేధావులు విద్యాసంస్థ యజమాన్యాలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు ఉద్యమకారులు అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని పర్యావరణ పరిరక్షణ వేదిక పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కందుల హనుమంతు ఎండి జమీరుద్దీన్ బత్తుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎలాంటి పనులు లేకుండా ఖాళీగా ఉంటున్న కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

**- సిర్పంగి స్వామి**

**వలిగొండ జూన్ 27 (వార్తా వేదిక సూర్య) :**
సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఎలాంటి పనులు లేకుండా ఖాళీగా ఉంటున్న కూలీలకు ఉపాధి హామీ పథకం కింద వెంటనే పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు.శనివారం రోజున పులిగిల్ల గ్రామంలో దళితవాడల సర్వే సమస్యలపై పోరుబాట అనే కార్యక్రమంను చేపట్టారు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిర్పంగి స్వామి మాట్లాడుతూ వర్షాలు లేక వ్యవసాయ కూలీలకు ఏలాంటి పనులు దొరకడం లేదని దీంతో వారు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పులిగిల్ల గ్రామం తో పాటు మండల వ్యాప్తంగా అనేక గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు అదేవిధంగా పులిగిల్ల ఎస్సీ కాలనీలో నిర్మాణం చేపట్టి ఆగిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు దళితులకు 55 సంవత్సరాలకే పేన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు నూతన పెన్షన్లకు ప్రభుత్వం వెంటనే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, కెవిపిఎస్ మండల అధ్యక్షుడు వేముల అమరేందర్, నాయకులు దొడ్డి యాదగిరి,లక్ష్మణ్, శివమణి,లక్ష్మమ్మ,యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.



www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
ఆదివారం
జూన్ 28, 2026
సంపుటి : 2, సంచిక : 39
Follow:




# సంగారెడ్డి పట్టణంలోని విద్యాలయాల్లో అభివృద్ధి పనుల కోసం రూ. 5.40కోట్ల టీజీఐఐసీ సీఎస్ఆర్ నిధులు!

- ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో హాస్టల్ నిర్మాణానికి రూ. 4 కోట్లు
- గర్ల్స్ జూనియర్ కాలేజీలో ఆడిటోరియం నిర్మాణానికి రూ. 75లక్షలు
- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణం కోసం - రూ. 15లక్షలు
- తారా డిగ్రీ కాలేజీలో ప్రహరీ నిర్మాణం కోసం - రూ. 50లక్షలు
- నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి, వార్తా వేదిక సూర్య ప్రతినిధి జూన్ 27:** సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వం పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో టీజీఐఐసీ నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.5.40కోట్లు అందాయి. నిధులతో ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో రూ. 4కోట్లు వెచ్చించి హాస్టల్ నిర్మించనున్నారు. రూ. 75 లక్షలతో గర్ల్స్ జూనియర్ కాలేజీలో ఆడిటోరియం నిర్మాణం చేపట్టనున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణం కోసం రూ. 75 లక్షలు వెచ్చించనున్నారు. తార డిగ్రీ కళాశాలలో ప్రహరీ నిర్మాణం కోసం ఇందులో నుంచి రూ. 50లక్షలు కేటాయించారు. ఈ పనులకు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, బ్లాక్ ప్రెసిడెంట్ జార్జ్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్లు సంగీత మహేష్, సుష్మిత, రవి నాయక్, శ్రీకాంత్ గౌడ్, ప్రీతి, కో ఆప్షన్ సభ్యులు బబ్బు, శివుడు, యశోద, సోహైల్, ఆరిఫ్ లతో పాటు ఉమెన్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ అరుణ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సునీత, తారా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రవీణ, ఎడ్యుకేషనల్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్క దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



**యాదగిరిగుట్ట జూన్ 27 (వార్త వేదిక సూర్య) :** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట రోడ్డు మార్గంలో ప్రతి షాపు యజమానులు, ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సీఐ బి. భాస్కర్ సూచించారు. పాతగుట్ట రోడ్డు మీదుగా దుకాణదారులు, చిరువ్యాపారస్థులకు సీసీ కెమెరాపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ భాస్కర్ మాట్లాడుతూ పాతగుట్ట రోడ్డు మీద ఉన్నటువంటి ప్రతి షాపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలను అరికట్టవచ్చన్నారు. ఏదైనా సంఘటనలు జరిగితే నేరస్తులను తేలికగా గుర్తుపట్టవచ్చన్నారు. శాంతి భద్రతలను కాపాడడానికి సీసీ కెమెరాలు అవసరమని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించడం, అనుమానాస్పద కదలికలను గుర్తించడం సులభమవుతుందని తెలిపారు. ప్రజల భద్రతను కాపాడడంలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. నేర సంఘటనలు జరిగినప్పుడు దర్యాప్తుకు సీసీ కెమెరాలు ఉపయుక్తంగా ఉంటాయని వివరించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ పట్టణ భద్రతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు. సీసీ కెమెరాల నిర్వహణను సక్రమంగా కొనసాగిస్తూ, వాటి ద్వారా పట్టణంలో శాంతి భద్రతలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుకాణ దారులు, పాతగుట్ట వాసులు తదితరులు పాల్గొన్నారు...

# కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేసి టెండర్ వేయాలని కోరుతు అంబేద్కర్ విగ్రహం ముందు రిలే నిరహార దీక్ష

**యాదగిరిగుట్ట జూన్ 27 (వార్త వేదిక సూర్య)** యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేసి షాపులకు వెంటనే టెండర్ వేయాలని కోరుతు యాదగిరిగుట్ట పట్టణంలో అంబేద్కర్ విగ్రహం ముందు రిలే నిరహార దీక్ష చేయడం జరిగింది. ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ కిరాయితో కొండపైన దుకాణాలు నిర్వహిస్తూ వాటిని అధికారుల మరియు రాజకీయ నాయకుల పైరవిలతో రెన్యువల్ చేసుకుంటూ కొత్తవారికి టెండర్లు వేసే అవకాశం ఇవ్వకుండా చేస్తున్న వర్తక సంఘాన్ని తక్షణమే రద్దు చేసి టెండర్లు వేయాలని కోరడం జరిగింది.. గతంలో కేవలం 30,40 షాపులే ఉండేవి. ఇప్పుడు వాటిని 114 షాపులుగా పెంచారు. రాజకీయ, అధికార బలం తోటి ఇష్టం వచ్చిన విధంగా ఈ షాపులను కేటాయిస్తున్నారు... స్వామివారి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా వీళ్లు ఎటువంటి ఆస్తులు కోల్పోలేదు, స్వామి వారి కోసం ఎంతోమంది వారి ఇండ్లను భూములను కోల్పోయారు. వారికి ఎటువంటి న్యాయం జరగలేదు.. ఇట్టి వర్తక సంఘం వల్ల దేవస్థానానికి మరియు భక్తులకు నష్టమే తప్ప లాభం లేదు.. కావున తక్షణమే వర్తక సంఘాన్ని రద్దుచేసి స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా టెండర్లు వేయాలని కోరడం జరిగింది..

గత నెల 31.05.26 వరకు వారికి గడువు ముగిసిన ఒక నెల వారికి మళ్ళీ అవకాశం ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం జరిగింది. ఇదే విధంగా కొనసాగించడం వల్ల దేవస్థానం ఆదాయం కు గండి పడుతుందని వాటిని కచ్చితంగా టెండర్ లు వేయాలని కోరడం జరిగింది, లేకపోతే ఉద్యమ కార్యాచరణ పెద్ద ఎత్తున చేస్తామని కమిటీ సభ్యులు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో కాటబత్తిని ఆంజనేయులు, పల్లపు బాలయ్య, బండి అనిల్, బుగ్గా ఆంజనేయులు, కర్రె ప్రవీణ్, మందోజ్ నరేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంకి మద్దతుగా

పెద్ద కందుకూరు గ్రామ సర్పంచ్ గుండ్లపల్లి వెంకటేష్, ఐ ఎన్ టి సి ప్రీమియం ప్రధానకార్యదర్శి రాజిరెడ్డి,బండ రామస్వామి , దేవపూజ అశోక్, ముఖ్యర్ల వెంకటేష్, చిన్న రాజు, పసుపునూటి మురళి, మాటూరి బాలయ్య, కొన్నె సంజీవ, దొమ్మాట ప్రభాకర్, గుండు కుమార్, శ్రీనాథ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..




# శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఆహ్వానం



**మోత్కూరు, జూన్ 27 ( వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 30 నుంచి జూలై 3 వరకు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు రావాలని యాదాద్రి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ కి ఆ ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో ఆ ఆలయ కమిటీ అధ్యక్షులు ముప్ప వెంకట్ రెడ్డి, డిసిసి మాజీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మొగుళ్ళపల్లి సోమయ్య,బండారు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



**మోత్కూరు, జూన్ 27 (వార్తా వేదిక సూర్య ):** అధిక ఫీజులు వసూలు చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వినియోగదారుల సంఘాల కార్యదర్శి పోచం సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ పాఠశాల యాజమాన్యం ఒకే తరగతికి వేర్వేరు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఈ ఫీజుల విషయంపై పలుమార్లు ఫీజుల పట్టిక ప్రదర్శించాలని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు కోరినప్పటికీ నేటికి ఫీజుల వివరాలు పాఠశాల యాజమాన్యం తెలుపలేదని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో నోటు బుక్స్ అమ్మ వద్దని ఆదేశాలు ఉన్నాయని ఒక్క 8వ తరగతి విద్యార్థికి నోట్ బుక్స్ 10,600 రూపాయల ధర నిర్ణయించి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని తెలిపారు అదేవిధంగా ప్రాజెక్టుల పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేయడం జరుగుతుందన్నారు. పై విషయాలన్నింటినీ ఎంఈఓ దృష్టికి తీసుకుపోగా ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే పాఠశాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సోమయ్య తెలిపారు. ఈ వినతి పత్రాన్ని అందజేసిన వారిలో ఆ పాఠశాల పేరెంట్స్ ఎలగందుల అమరేందర్, పెండెం నరహరి, పసునూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



**మోత్కూరు, జూన్ 27 ( వార్త వేదిక సూర్య):** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని పనకబండ ఉప సర్పంచ్ రాధారపు మల్లేశం అన్నారు. అదే గ్రామానికి చెందిన పోలేపల్లి మంగమ్మ ఇటీవల అనారోగ్యంతో గుర్రై భువనగిరిలో ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందారు. నిరుపేద కుటుంబానికి చెందిన మంగమ్మ ఆ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ మల్లేశం తెలియజేయడంతో ఆయన భాజపా తుంగతుర్తి నియోజకవర్గ ఇంచార్జి కడియం రామచంద్రయ్య సహకారంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి క్రింద 26,500 రూపాయలు శనివారం మంజూరు అయ్యాయి. మంజూరైన ఈ చెక్కును ఆమె నివాసంలో బాధితురాలికి మల్లేశం అందజేశారు. ఈ కార్యక్రమంలో భాజపా మండల ప్రధాన కార్యదర్శి పైళ్ళ సతీష్, మండల నాయకులు బత్తిని సతీష్,గ్రామ శాఖ అధ్యక్షులు నల్లపోగుల వెంకటేష్, స్థానికులు కారుపోతులశేఖర్,నిలిగొండ నరేష్, నల్లమాల మహేందర్, పోలేపల్లి అంజయ్య,నిలిగొండ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**వలిగొండ:జూన్ 27 (వార్తా వేదిక సూర్య) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సుంకిశాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఈతాప రాములు అనారోగ్యంతో ఉండడంతో శనివారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి వారిని పరామర్శించి రూ.50,000/- ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**